

ప్రజావేదిక గ్రామసభకు హాజరైన జనం

టీడీపీ సమావేశంలో పాల్గొన్న నేతలు, కార్యకర్తలు

కార్యకర్తలను చూస్తే కొండంత ధైర్యం

2019 ఎన్నికల్లో ఓటమికి వారిలో అసంతృప్తే కారణం

కార్యకర్తలకు ఎమ్మెల్యేలు, ఎంపీలు అందుబాటులో ఉండాలి

టీడీపీ శ్రేణుల సమావేశంలో చంద్రబాబు





గంగాధరనెల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 'కార్యకర్తలను చూస్తే నాకు కొండంత ధైర్యం వస్తుంది. 8 నెలలుగా పాలనలో నిమగ్నమై పార్టీ శ్రేణులతో సమావేశం కాలేకపోయా. మళ్లీ కుటుంబ సమానులైన కార్యకర్తలను కలుసుకోవడం సంతోషంగా ఉంది' అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు.గంగాధర నెల్లూరు పర్యటనలో భాగంగా బీసీ, ఎస్సీ కాలనీల్లో వాసు, వసంతమ్మలకు ఆయన పెన్షన్లను పంపిణీ చేశారు. అనంతరం ఎస్సీకాలనీలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు.అక్కడే ఏర్పాటుచేసిన ప్రజావేదికలో ప్రసంగించాక సమీపంలోని రామానాయుడుపల్లె వద్ద శనివారం మండల టీడీపీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ '30 ఏళ్ల తర్వాత గంగాధరనెల్లూరులో టీడీపీ జెండా ఎగరేశాం. పార్టీ విజయం కోసం కార్యకర్తలు ప్రాణం పెట్టి పనిచేశారు. మీకు నేను పూర్తిగా సహకరిస్తా. ఈ నియోజకవర్గాన్ని పార్టీకి కంచుకోటగా మార్చాలి. తంబళ్లపల్లె, పుంగనూరులో కాస్త గురి తప్పాం.. తప్ప జిల్లా అంతటా టీడీపీ జెండా ఎగిరింది. మొన్నటి ఎన్నికల్లో సరిగా చేసుకుని ఉంటే పులివెందులలో కూడా మనమే గెలిచేవాళ్లం. 2014-19 మధ్య అవిశ్రాంతంగా పనిచేసి 13.5 గ్రోత్‌రేట్ సాధించాం. అయినా ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిందంటే దానికి కారణం ప్రజలకు మంచి చేయకపోవడం వల్ల కాదు.. కార్యకర్తల్లో అసంతృప్తి వల్లే. మీలో అణువణువూ పసుపు రక్తం తప్ప మరోటి ఉండదు. మీతో నేను మాట్లాడకుంటే నాపై అసంతృప్తి చెందుతారు. అందుకే కార్యకర్తల కోసం సమావేశం ఏర్పాటు చేయించా. ఇక నుంచి నాకూ,కార్యకర్తలకు మధ్య దూరం ఉండదు. పర్యటనకు వెళ్లిన ప్రతిచోటా కార్యకర్తలతో సమావేశమవుతా' అన్నారు.ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజలతో అనుసంధానం కావడంతో పాటు కార్యకర్తలకూ అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. జనసేన, బీజేపీ నాయకులతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. వన్‌టైమ్ ఎంపీ, ఎమ్మెల్యేగా భావించకుండా రాజకీయాల్లో ఉన్నన్నాళ్లు ప్రజాప్రతినిధులుగా ఉండేలా పనిచేయాలని ఉద్బోధించారు.వైసీపీ నేతలకు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఉపకారం ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదన్నారు.వారికి ఉపకారం చేయడమంటే పాముకు పాలు పోసినట్లే. అని గుర్తించాల న్నారు.టీడీపీ శ్రేణులు కూడా ఇష్టానుసారంగా కాకుండా నాయకత్వం కింద పనిచేయాలని సూచించారు.



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న అభిమానులు

2 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు

● గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి సీఎం చంద్రబాబు వరాలు

గంగాధరనెల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 'చిత్తూరు-తచ్చూరు హైవే పూర్తయితే చెన్నైకి 45నిమిషాల్లో, బెంగళూరుకు ఒకటిన్నర గంటలో వెళ్లిపోవచ్చు. దానికి అనుగుణంగా చిత్తూరు-తచ్చూరు హైవే సమీపంలో ఇండస్ట్రియల్ పార్కు కోసం 2 వేల ఎకరాలను సేకరించమని కలెక్టర్‌కు చెప్పా. బయటి ప్రాంతాల నుంచి పెద్ద కంపెనీలను తీసుకొచ్చి ఇక్కడ నిరుద్యోగ సమస్య తీరుస్తా' అని సీఎం చంద్రబాబు ప్రజావేదిక పేరుతో ఏర్పాటు చేసిన గ్రామసభలో హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ జలాశయం, కృష్ణాపురం ప్రాజెక్టులను అనుసంధానం చేసి సాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి బాలుర గురుకుల పాఠశాలను మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో సాగు, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని, హార్టికల్చర్ పంటలు పెరిగిన నేపథ్యంలో మామిడి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి సౌకర్యాలను పెంచుతామన్నారు. జీడీనెల్లూరు నియోజకవర్గ కేంద్రంలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు థామస్, అమరనాథరెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, గురజాల జగన్మోహన్, మురళీమోహన్,టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ పాల్గొన్నారు.

అవీ ఇవీ

● టీడీపీ కార్యకర్తల సమావేశంలో చివరగా క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయిలో కృషి చేసిన శ్రేణుల పేర్లను చంద్రబాబు చదివి అభినందించడంతో చప్పట్లతో సమావేశం మార్మోగిపోయింది.

● హెలిప్యాడ్‌లో ఎమ్మెల్యే థామస్ తన ఇద్దరు కుమారులను చంద్రబాబుకు పరిచయం చేశారు.

● పెన్షన్ల పంపిణీతో పాటు సెల్వి అనే మహిళతో పాటు ఆమె మనవరాళ్ల చదువుకు, సొంతింటికి ఆర్థిక సాయం చేయడం, ప్రజావేదికలో పాల్గొనడం గురించి సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో ఫొటోలతో సహా పోస్టు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని చెప్పుకొచ్చారు.

● టీడీపీ కార్యకర్తల మీటింగులో వేదిక మీద ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే థామస్, పార్టీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌లతో పాటు గతంలో నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా పనిచేసిన భీమనేని చిట్టిబాబుకు కూడా అవకాశం దక్కింది.

● చంద్రబాబు బస్సులో వుండగా టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు లోపలికెళ్లి కాసేపు మాట్లాడారు.

● హెలిప్యాడ్‌లో ఎల్1, ఎల్2 విభాగాల్లో టీడీపీ నాయకులు ప్రాధాన్యతను బట్టి సీఎం చంద్రబాబును కలిశారు. ఎల్1లో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులు కలవగా.. అందరి భుజాలపై చేతులేసి చంద్రబాబు పేర్లతో పలకరించడంతో వారంతా మురిసిపోయారు.



కళ్యాణం.. కమనీయం

● వైభవంగా ఆదిదంపతుల వివాహ వేడుక
● తరలివచ్చిన భక్తజనం
● ఒక్కటైన 41 జంటలు



నేటి వాహన సేవలు
ఉదయం: బనాత అంబారీ వాహన సేవ
రాత్రి: అశ్వ, సింహ వాహనసేవలు

శ్రీకాళహస్తి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అనంత విశ్వమే పందిరిగా... ఆచంద్రతారలే అలంకారాలుగా... భూమండలమే వివాహ వేదికగా... పంచభూతాల సాక్షిగా... అష్టదిక్కులు, ముల్లోకాల నుంచి ముక్కోటి దేవతాగణాలు వీక్షిస్తుండగా.. అశేష భక్తజన వాహిని మధ్య శనివారం ఆది దంపతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో వేద మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా జ్ఞానప్రసూనాంబదేవికి శ్రీకాళహస్తీశ్వరుడు మాంగల్యధారణ చేశారు. ఇదే శుభ ఘడియలో ఆది దంపతుల సమక్షంలో 41 జంటలు వివాహం చేసుకుని ఒక్కటయ్యాయి. వధూవరులకు ముక్కంటి ఆలయం తరఫున మంగళసూత్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, దుస్తులు అందజేశారు. అంతకు మునుపు శుక్రవారం రాత్రి ఆలయంలోని అలంకార మండపంలో శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తదనంతరం స్వామివారిని గజ వాహనంపై, అమ్మవారిని సింహ వాహనంపై అధిష్టింపజేశారు. మంగళవాయిద్యాలు, మేళతాళాలు, కళాకారుల ఆటలు, పాటల మధ్య ఆది దంపతులు పెండ్లిమండపం వద్దకు చేరుకున్నారు. మొదట పరమేశ్వరుడు చేరుకోవడంతో పార్వతీదేవి అలకబూనారు. చండికేశ్వరుడు మధ్యవర్తిత్వం నిర్వహించి అమ్మవారి అలక తీర్చారు. గంగాధరుడు, శివానీ పెళ్లిపీటలపై ఆసీనులయ్యారు. వేదపండితులు కలశ స్థాపన చేశారు. సంకల్పం, యజ్ఞాహుతి పూజలు పూర్తి చేశారు. పూజల అనంతరం వేదపండితులు మంత్రోచ్చరణలు చేస్తూ ఆదిదంపతుల కల్యాణ ఘట్టాన్ని పూర్తిచేశారు. కల్యాణం వీక్షించడానికి పట్టణవాసులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తజనం తరలివచ్చారు. నగరి వీధి, నెహ్రూ వీధి భక్తులతో నిండిపోయాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, ఈవో బాపిరెడ్డి, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, టీడీపీ నాయకుడు చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.

నేడు కైలాసగిరి ప్రదక్షిణ

మహాశివరాత్రి వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కైలాసగిరి ప్రదక్షిణ నిర్వహించనున్నారు. శివపార్వతుల కల్యాణానికి విచ్చేసిన సకల దేవతాగణాలు, మునులు, రుషులకు వీడ్కోలు పలికేందుకు స్వామి అమ్మవార్లు ఈ ప్రదక్షిణకు వెళ్లనున్నారు. దీనికి సంబంధించి ఆలయాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గిరి ప్రదక్షిణ మార్గంలో చలువ పందిళ్లు సిద్ధం చేశారు. అన్న ప్రసాదాలు, తాగునీరు, పండ్లు, మజ్జిగ అందుబాటులో పెట్టనున్నారు.

SALC వారి హెచ్చరిక

SALC ఈస్ట్ చర్చి వారి స్థలం ఎం.ఆర్. పల్లి తిరుపతి
తిరుపతి జిల్లా కలెక్టర్ బంగ్లా ప్రక్కన (క్రిస్టియన్ హాస్టల్)

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా మా కక్షిదారులు బిషప్ ప్రెసిడెంట్ రైట్. రేవ.ఎం మైకేల్ బాబు, వైస్ ప్రెసిడెంట్, రేవ.ఎం జె ఎస్ మనోజ్ కుమార్, కార్యదర్శి శ్రీమతి.ఎం నిర్మల, బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ చైర్మన్ ఎస్. రమ్య సురేష్ మరియు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా, బోర్డు చైర్మన్లుగా మొదలగువారు 71వ సర్వసభ్య సమావేశం తేదీ 28.1.2025న ఎన్నిక కాబడి ఎగ్జిక్యూటివ్ కమిటీ వారు బి.శ్రీహర్ష అనురాగ్‌కుమార్ ను కోశాధికారిగా నియమింపబడి సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చ్, సెంట్రల్ చర్చ్ ఆఫీస్, ఈస్ట్ మిషన్ కాంపౌండు, తిరుపతి నుండి పాలక వ్యవహారాలను జరుపుచున్నారు.

సదరు **SALC EAST MISSION COMPOUND** వారు క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై తిరుపతి పదవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు లో దావా నెంబరు **O.S.No.104/2016** తేదీ 12/7/2024 న మా కక్షిదారులకు అనుకూలంగా డిక్రీ, జడ్జిమెంట్ పొంది ఉన్నారు సదరు డిక్రీ పై **E.P.NO** 132 /2024 పదవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు నందు మా కక్షిదారుల సంస్థ SALC వారికి రావలసిన **రూ: 9,11,85,094/- (అక్షరాల తొమ్మిది కోట్ల పదకొండు లక్షల ఎనభై ఐదు వేల తొంభై నాలుగు రూపాయలు)** గాను సదర్ షెడ్యూలు ఆస్తిని అటాచ్ చేయునట్లు మరియు కోర్టు వేలం ద్వారా క్రయం కొరకు దాఖలు పరిచి ఉన్నారు సదరు ఆస్తిపై మా కక్షిధారుల సంస్థ తప్ప వేరే ఎవరికీని ఎటువంటి హక్కు లేదని తెలియజేయడమైనది.

సదరు దావా **OS No 104/2016** పదవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు డిక్రీ జడ్జిమెంట్ పై ప్రతివాదులు ఎటువంటి అపీలు వేయలేదు అందు మా కక్షిదారుల తరఫున గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో **Caveat** వేసి ఉన్నారు.

సదరు ఆస్తిపై పడియాల శ్రీహరి, పత్రి సుబ్బరామయ్య, నిరంజన్ కుమార్, కే సత్యనారాయణ, కిషోర్ కుమార్ మరియు వారి అనువాయిలు పై కనిన ధావాలు, జడ్జిమెంట్లు వాస్తవాలను కప్పిపుచ్చి మా కక్షిదారుల చర్చి షెడ్యూలు స్థిరాస్తులపై మోసపూరితముగా నామమాత్రపు పత్రాలను సృష్టించుటకు మా కక్షిదారులను ఇబ్బంది పెట్టుటకు ప్రయత్నం చేయుచున్నారని అట్టి నామమాత్రపు పత్రాలను క్రయవిక్రయాలను మా కక్షిదారుల **SALC** సంస్థకు ఎటువంటి సంబంధం లేదు.

సదరు షెడ్యూల్ దాఖలా ఆస్తిలో కె.సత్యనారాయణ పి.కిషోర్ కుమార్ రెడ్డి వగైరాలు టీ. మునిరామరెడ్డి టి.లత కలిసి కుమ్మక్కై వాస్తవాలను వక్రీకరించి **(Collusive Suit)** దావా **OS No. 64/2022** నాలుగు అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు తిరుపతి అందు మా కక్షిదారులు **O.S. No. 104/2016** దావాలో డిక్రీ, జడ్జిమెంట్ మేరకు **Implead Petition** వేసి ఉన్నారు.

సదరు షెడ్యూల్ దాఖలా ఆస్తి పై ఇదివరలో **O.S. No.** 52/2012 నాలుగవ ఆదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో **Implead Petition** మా కక్షిదారుల **SALC** సంస్థ వారు **I.A. No. 37/2022** మరియు **I.A. No. 241/2018 తేదీ 04/03/2025**న వాయిదా ఉన్నది.

పై కానిన ధావాలలో మా కక్షిదారులకు అనుకూలంగా డిక్రీ జడ్జిమెంట్ పై **EP**లు వేయడం, మరియు దావాలలో **Implead Petitions Pending**లో ఉండగా సదరు **పడియాల శ్రీహరి, P.కిషోర్ కుమార్, కే సత్యనారాయణ, పత్రి సుబ్బరామయ్య, P.నిరంజన్ కుమార్** వగైరాలు సదరు షెడ్యూలు ఆస్తులపై ఎటువంటి హక్కు బాధ్యత లేకుండా మోసపూరితముగా మా కక్షిదారుల సమస్త ఈస్ట్ మిషన్ కాంపౌండ్ వారికి సంబంధించి ఆస్తులపై నామమాత్రపు పత్రాలను సృష్టించుటకు ప్రయత్నించుచున్నారు అట్టి తప్పుడు లావాదేవీలు చెల్ల నేరవని అట్టి లావాదేవీలు పై అక్రమార్కులపై మా కక్షిదారుల సంస్థ **SALC** వారు చట్టపరంగా తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని తీవ్రంగా హెచ్చరించడమైనది

షెడ్యూలు : తిరుపతి జిల్లా శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా తిరుపతి సబ్ డీ తిరుపతి అర్బన్ మండలం ముత్యాలరెడ్డిపల్లి అమరావతి నగర్ చేరిన క్రిస్టియన్ హాస్టల్ నెం 29రు తిరుపతి గ్రామ లెక్క దాఖలా సర్వేనెం. 304 రుగా యుండి సబ్ డివిజన్ కాబడిన పిదప సర్వేనెం.304/1రులో జగాకు హద్దులు కొలతల వివరములు, **తూర్పు:** గిరిధర్ బాబు గారి డోర్ నెం. 9-66/1రు, **పడమర:** ఆర్ పిల్లి రోడ్డు, **ఉత్తరం:** కలెక్టరు వారి బంగ్లా, **దక్షిణం :** వాటి మరియు సుబ్రహ్మణ్యంరెడ్డిల కెరియర్ లాంచర్) ఈ నాలుగు హద్దుల మధ్యన గల **మార్పు** చ 55. 41730.93 లేక (చ.గ.)లు 4636,770 గల జగాపూర మా సంస్థ **SALC,** ఈస్ట్ మిషన్ కాంపౌండ్ వారికి సంబంధించినది.

బి. శ్రీహర్ష అనురాగ్‌కుమార్ సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చ్,తిరుపతి కోశాధికారి. సెల్: 78999 39933	మట్టా పురుషోత్తం రెడ్డి న్యాయవాది, తిరుపతి.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

● 820 మంది గైర్హాజరు



తిరుపతి ఎస్వీ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు

తిరుపతి(విద్య), మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రథమ సంవత్సర లాంగ్వేజ్ పేపర్-1 పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగింది. జిల్లాలోని అన్ని కేంద్రాల్లో విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు. 8.30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. మెటల్ డిటెక్టర్లతో నిశితంగా తనిఖీ చేశారు. సెల్‌ఫోన్లు లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. జిల్లాలో 86 పరీక్ష కేంద్రాల్లో జనరల్ విద్యార్థులకు, 15 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్లు డీఈసీ మెంబర్లు నిరంతరం పర్యవేక్షిస్తూ కనిపించారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 33,164 మందికి గాను 820 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ ఎస్పీ హర్షవర్ధనరాజు, ఆర్ఐఓ నగరంలోని పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. సోమవారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం కానున్నాయి.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆదివారం) : 6.24
సహరి (సోమవారం) : 5.10

చంద్రగిరిలో ఇంటర్ పరీక్షలకు 33మంది గైర్హాజరు



పాకాలలో పరీక్షా కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు

చంద్రగిరి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలో ఐదు సెంటర్లలో శనివారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. బాలుర కళాశాలలో ఏ సెంటర్లో 20 మంది, బీ సెంటర్లో ఆరుగురు గైర్హాజరయ్యారు. బాలికల జూనియర్ కళాశాలలో ఏ సెంటర్లో ఐదుగురు, బీ సెంటర్లో ఇద్దరు పరీక్షకు హాజరుకాలేదు. శ్రీనివాసమంగాపురం సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాల సెంటర్లో 13 మంది గైర్హాజరయ్యారు. **పాకాల:** స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 215 మందికి గాను 211 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రం చీఫ్ భరణికుమార్, డిపార్ట్‌మెంటల్ అధికారి సతీష్‌బాబు పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు, జిరాక్స్ సెంటర్లను మూసివేయించినట్లు తెలిపారు.

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి రోజు 261 మందికి గాను 10 మంది గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ నాగరాణి తెలిపారు. పరీక్షా కేంద్రంలో తాగునీరు, వైద్య సదుపాయం కల్పించారు. హెల్ప్ డెస్కు ఏర్పాటుచేశారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన



తిరుమల, మార్చి1(ఆంధ్రజ్యోతి): మహిళ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా తిరుమల ఎస్వీ ఉన్నతపాఠశాల విద్యార్థినులకు తిరుమల పోలీసులు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లోని లాకప్, రిసెప్షన్, మహిళల కోసం ప్రత్యేకంగా చట్టాలను వివరించారు. విద్యార్థునుల సందేహాలను నివృత్తి చేశారు. పలు టోల్‌ఫ్రీ నెంబర్లను తెలియజేశారు. విద్యార్థులను ప్రస్తుత పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్త, పాటించాల్సిన నిబంధనలపై వివరించారు. కార్యక్రమంలో సీఐ శ్రీరాముడు, ఎస్ఐ లక్ష్మన్‌రెడ్డి, సివిల్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న అభయం



చంద్రగిరి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారు తిరుచ్చిపై దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. 10.30 గంటలకు శాస్త్రోక్తంగా ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో భక్తులకు ఊరేగించారు. కార్యక్రమాల్లో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్



మొగరాలలో అవగాహన కల్పిస్తున్న శశిరేఖ

చంద్రగిరి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అన్ని పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈవోఆర్డీ వెంకటరత్నం ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ఇంటింటికి వెళ్ళి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలను ఎలా వేరు చేయాలో వివరించారు. **పాకాల:** మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని ఈవోపీఆర్డీ బి.శశిరేఖ కోరారు. మండలంలోని పంచాయతీల్లో తడి పొడి చెత్త వేరు చేసే విధానంపై ఆమె అవగాహన కల్పించారు. చెత్త రహిత గ్రామాలుగా అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. **భాకరాపేట:** ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఎంపీడీవో గిడ్డయ్య పరిశీలించారు. ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమశేఖరరెడ్డి, కార్యదర్శులు రామ్మోహన్, గిరిబాబు, స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్ గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి



రామకృష్ణ పరమహంస గురించి వివరిస్తున్న మురళి

పాకాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణ మందిరంలో శనివారం రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, అష్టోత్తర, విష్ణు నామార్చన, హోమం, విశేష పూజ, పుష్పాంజలి స్వామి భాస్కరానంద పర్యవేక్షణలో నిర్వహించారు. రామకృష్ణ పరమహంస జీవితంపై అవధాని ఆముదాల మురళి, సుబ్రమణ్యంసందేశం ఇచ్చారు. మధ్యాహ్నం అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌సి రామచంద్రారెడ్డి, సభ్యులు,స్థానికులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలంలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

రామచంద్రాపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సీకేపల్లె పంచాయతీ చిట్టత్తూరు దళితుల శ్మశాన స్థలంలో ఆక్రమణలను రెవెన్యూ సిబ్బంది శనివారం తొలగించారు. కొన్నేళ్ల క్రితం గ్రామానికి చెందిన ఒకరు ఆక్రమించి కంచె వేసి మామిడిచెట్లను నాటాడు. ఈ నేపథ్యంలో దళితులు తహసీల్దారు వెంటకరమణను కలిసి ఫిర్యాదుచేశారు. దీంతో తహసీల్దారు ఆదేశాల మేరకు ఆర్ఐ లక్ష్మీనారాయణ, కమ్యూనిటీ సర్వేయర్ మణి, హెచ్‌సీ సుధాకర్‌రెడ్డి, వీఆర్వోలు వెళ్లి ఎక్సకవేటర్‌తో శ్మశానంలో ఆక్రమణలు తొలగించారు. అందులోని మామిడిచెట్లను దళితులకు అప్పగించారు.

జీవాల పెంపకంపై ముగిసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ



తిరుపతి రూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో నిరంతర పశువైద్య విద్య, సమాచారకేంద్రం ఆధ్వర్యంలో ఐసీఏఆర్-నార్మ్ ఆర్థిక సౌజన్యంతో ఎస్సీ మహిళలకు శాస్త్రీయ పద్ధతుల్లో జీవాల పెంపకంపై మూడ్రోజులపాటు నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ శనివారం ముగిసింది. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ మాట్లాడుతూ.. శిక్షణ ద్వారా పొందిన పరిజ్ఞానంతో జీవాలపెంపకాన్ని చేపట్టి ఆర్థిక అభివృద్ధిని సాధించాలన్నారు. శిక్షణలో పాల్గొన్న మహిళలకు రెండు పొట్టేళ్ల పిల్లలు, 10కేజీల దాణా వంతున పంపిణీ చేశారు. అధికారులు సీహెచ్ శ్రీలత, శోభామణి, డాక్టర్ ఎం.బాలక్రిష్ణన్, కె.సుజాత, డాక్టర్ వి.మంజరి పాల్గొన్నారు.

విద్యార్థుల ఆందోళనకు రైతుసంఘాల నేతల మద్దతు



సమావేశంలో విద్యార్థులకు అనుకూలంగా మాట్లాడుతున్న నాయకులు

తిరుపతి రూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేస్తున్న సమ్మెకు జిల్లాకు చెందిన రైతుసంఘాల నేతలు శనివారం సంఘీభావం ప్రకటించారు. భైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్యభవన్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు రైతుప్రతినిధులు హాజరై విద్యార్థులకు మద్దతు తెలిపారు.సమావేశానికి పలువురు వెటర్నరీ విద్యార్థులు హాజరై తమసమస్యని వివరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులతో రైతుసంఘాల ప్రతినిధులు కలసి మాట్లాడుతూ సమ్మె చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరమని వాపోయారు. శనివారమూ నిరవధిక సమ్మెని కొనసాగించారు.

శ్రీవారిసేవలో ఉత్తరాఖండ్ హైకోర్టు సీజే



తిరుమల, మార్చి1(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గుహనాథన్ నరేందర్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి లడ్డూప్రసాదాలు అందజేశారు.

సంతోషాన్ని పంచుతున్న 'మజాకా'



మజాకా చిత్రం బృందం

తిరుమల, మార్చి1(ఆంధ్రజ్యోతి): 'మజాకా' చిత్ర బృందం శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. ఈ చిత్ర హీరో సందీప్ కిషన్, దర్శకుడు త్రినాథరావు నక్కిన, రచయిత ప్రసన్నకుమార్ తదితరులు శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు వీరిని చూసేందుకు అభిమానులు పోటీ పడ్డారు. 15 ఏళ్ల సినిమా ప్రయాణంలో వేంకటేశ్వరస్వామి తోడుగా ఉన్నారని హీరో సందీప్ కిషన్ అన్నారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తన 30వ సినిమా 'మజాకా' కుటుంబంతా నవ్వుకునే సినిమా అన్నారు. అలిపిరి మెట్టెక్కి శ్రీవారిని దర్శించుకునేంతవరకు దాదాపు 200 మందికిపైగా తమ 'మజాకా' చిత్రం బాగుందని అభినందనలు తెలిపారన్నారు. తమిళ హీరో విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకత్వంలో మరో చిత్రంలో నటిస్తున్నట్టు ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

4న ఆటో కార్మికుల నిరసన



పాకాలలో సమావేశమైన ఆటో డ్రైవర్లు

పాకాల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.శివ కోరారు. స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో శనివారం ఆటో డ్రైవర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐటియూసీ కౌన్సిల్ మెంబర్ ప్రకాష్, అమ్మ ఆటో స్టాండు డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు రహీం తదితరులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నాయకులు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఈ నెల 4న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిన్ని, వాసు, హమీదుల్లా ఖాన్, ముషీర్, మున్‌సూర్ అలీ, పురుషోత్తం, ఖాదర్, శీను పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని వినతి



తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను కోరుతున్న ప్రజలు

తిరుపతి (ఎంఆర్‌పల్లె), మార్చి 1(ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని సాయినగర్ పంచాయతీ, ఈశా ఆస్పత్రి, రాయలసీమ ఇంజనీరింగ్ కళాశాల, హాస్టల్ ప్రాంతాల మహిళలు కోరారు. శనివారం వారు తిరుపతి ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సాయినగర్ పంచాయతీ పరిధిలోని జయనగర్‌కాలనీ తుడా అప్రూవల్ రెసిడెన్షియల్ ప్రాంతంలో ప్రధాన రోడ్డు వద్ద మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గత ఏడాది అక్టోబరు 2న తమప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయరాదని తీర్మానిస్తూ ప్రభుత్వానికి నివేదించామని గుర్తు చేశారు.

ఈ-క్రాప్ చేయించుకోవాలి

రేణిగుంట మార్చి 1:(ఆంధ్రజ్యోతి): సాగు చేస్తున్న పంటను ఈ -క్రాప్ చేయించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శనివారం గాజుల మండ్యంలో వ్యవసాయ సహాయకులు నమోదు చేసిన పంటలను తనిఖీ చేశారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగితే పరిహారం అందించేందుకు ఈ క్రాప్ ఉపయోగపడుతుందన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావు, మండల వ్యవసాయ అధికారి సునీల్ కుమార్ రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.





గరుడ నగర్ దారిలో వ్యర్థాలు - మసీదువీధి ఖాళీస్థలంలో పెరిగిన ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలు

అధ్వాన పారిశుధ్యంతో అవస్థలు

తిరుపతి రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గాంధీపురం గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. అవిలాలచెరువు ప్రహరీకి ఆనుకుని ఉన్న రోడ్డుపక్కనే వ్యర్థాలను పడేస్తున్నారు. వారం రోజులుగా వీటిని తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. బైపాస్‌రోడ్డుకు వెళ్లే దారిలో డ్రైనేజీకాలువలో పాచిపేరుకుపోయింది. డ్రైనేజీవ్యవస్థ లేకపోవడంతో నీరు నిలిచిపోతోంది. మరోపక్క మసీదువీధిలో ఖాళీస్థలంలో ముళ్లపొదళ్లు, పిచ్చిమొక్కలు గుబురుగా పెరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ నుంచి విష కీటకాలు ఇళ్లలోకి కూడా వస్తున్నాయంటున్నారు. ఖాళీస్థలానికి పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడంతో పాముల బెడద ఎక్కువగా ఉందని పంచాయతీ పాలకవర్గానికి, ఖాళీస్థల యజమానికితెలియజేసినా పట్టించుకోలేదంటున్నారు. శ్మశానస్థలంలో తుమ్మలగుంట డ్రైనేజీనీరు చేరుతోంది. పంచాయతీలో 37మంది కార్మికులున్నా పారిశుధ్య నిర్వహణ కొరవడిందని స్థానికులు పెదవి విరుస్తున్నారు.

పాదాల మండపం ఆలయంలో శాస్త్రోక్తంగా బాలాలయం

● 17వ తేదీ వరకు దర్శనాల రద్దు



గోదా అమ్మవారి ఆలయంలో శాస్త్రోక్తంగా సంప్రోక్షణ కార్యక్రమాలు

తిరుమల, మార్చి1(ఆంధ్రజ్యోతి): లిపిరి పాదాల మండపం వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీ నారాయణస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న గోదా అమ్మవారి ఆలయంలో అష్టబంధనం కారణంగా శనివారం ఉదయం బాలాలయ సంప్రోక్షణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. 3న పూర్ణాహుతితో కార్యక్రమాలు ముగియనున్నాయి. ఈక్రమంలో ఉదయం 8 గంటలకు పుణ్యాహవచనం, వాస్తుహోమం, అకల్మష హోమం, రక్షాబంధనం, ఇతర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు కుంభస్థాపన, కళాకర్షణ, అగ్నిప్రతిష్ట లాంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం యాగశాలలో పంచగవ్యాదివాసం, క్షీరాదివాసం, జలవాసం నిర్వహించనున్నారు. సోమారం ఉదయం ఉదయం 9.20 నుంచి 9.55 గంటల మధ్య మేషలగ్నంలో బాలాలయ సంపోక్షణం చేపట్టనున్నారు. గర్భాలయంలో జీర్ణోద్ధరణకు బాలాలయం చేపడతారు. ముఖ మండపంలో నమూనా ఆలయం ఏర్పాటు చేసి గర్భాలయంలోని మూలవర్ల చిత్రపటాలను ఏర్పాటు చేస్తారు. తదుపరి మహా సంప్రోక్షణ జరిగే వరకూ స్వామి, అమ్మవార్లకు నిత్యకైంకర్యాలన్నీ ఇక్కడే నిర్వహిస్తారు. తొలిరోజు కార్యక్రంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు, ఆగమ సహాలదారు మోహనరంగాచార్యులు, సీతారామాచార్యులు, కంకణభట్టర్ మురళీకృష్ణచార్యులు, రుత్వికులు, ఏఈవో మునికృష్ణారెడ్డి, పాల్గొన్నారు. బాలాలయం కారణంగా 17వరకూ శ్రీవారి ఆలయంలో దర్శనం ఉండదు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



పింఛను అందజేస్తుస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కందులవారిపల్లె, ఎ.రంగంపేట, దోర్నకంబాల పంచాయతీల్లో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే పులివర్తి నాని అందజేశారు. ఇంటింటికి వెళ్లి పింఛనుదారులను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు ఉన్నా కూటమి ఒకరోజుకూడా ఆలస్యంగా పింఛన్లను అందజేస్తోందన్నారు. ప్రజల కష్టాలను, సమస్యలు తెలిసిన సీఎం చంద్రబాబు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. డీపీవో సుశీలాదేవి, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు కొత్త పింఛన్ల మంజూరు

రామచంద్రాపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఐదుగురు కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం రూ.10 వేల వంతున పింఛన్లను మంజూరు చేసిందని ఎంపీడీవో ఇందిరమ్మ తెలిపారు. శనివారం వీరికి పింఛను పత్రాలను అందజేశామన్నారు. అనుపల్లి, రాయలచెరువు, గంగిరెడ్డిపల్లి, సొరకాయలపాళెం, నెన్నూరు గ్రామాల్లో డయాలసిస్ రోగులకు మాజీ ఎంపీపీ బిందుమాధవి, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి పింఛన్లను అందజేశారు. టీడీపీ నాయకులు ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నయనానందకరం నటరాజ కల్యాణం





మాంగళ్యాన్ని చూపుతున్న అర్చకుడు -పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షికోత్స వాలను పురస్కరించుకుని శనివారం రాత్రి సభా పతి కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. దక్షయజ్ఞ సమయంలో సతీ వియోగంతో పరమేశ్వరుడు యోగధ్యానంలోకి వెళ్ళడంతో సర్వలోకాలు తల్లడిల్లిపోతాయి. అదే సమయంలో తారకా సురుడు అనే రాక్షసుడు శివుడి సంతానంతో మాత్రమే మృత్యువు పొందే విధంగా వరాన్ని పొందుతాడు. శివుడికి సతీదేవి లేదని, ఆయన వివాహం జరగదని తలచిన తారకాసురుడు తన వికృతరూపం చూపుతాడు. దీంతో అదే సమయంలో స్కందుడి ధ్యానం కోసం పార్వతీదేవి హిమవంతుని కుమార్తెగా జన్మి స్తుంది. ఆ సమయంలో నటరాజస్వామికి, శివ కామ సుందరికి దేవతలు ఘనంగా వివాహం జరుపుతారు. ఈ వివాహ వేడుకల ముక్కంటి ఆలయ ప్రాంగణంలో అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శివకామసుందరి సమేత నటరాజస్వామిని పురవీధుల్లో ఊరేగిం చారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రుద్రాక్ష చప్పరాలపై రుద్రుడి వైభవం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షికోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఉదయం ఆదిదంపతులు రుద్రాక్ష చప్పరాలపై పురవిహారం చేశారు. ఆదిదంపతుల కల్యాణం ముగిసిన తరువాత ఉత్సవమూర్తులను ఆలయానికి తీసుకెళ్లారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో అలంకార మండపంలో పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ఆలయ వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను రుద్రాక్ష చప్పరాలపై అధిష్టింపజేసి పురవిహారానికి తీసుకువచ్చారు. జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి దంపతులను దర్శించుకోవడానికి భక్తులు బారులుతీరారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌కు అపోలోలో అధునాతన వైద్యం




అధునాతన వైద్య పద్ధతుల గురించి వివరిస్తున్న డాక్టర్ శ్రీనివాసన్

తిరుపతి(వైద్యం), మార్చి 1(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌కు ఎటువంటి కోత, కుట్లు లేకుండా అధునాతన పద్ధతులతో చెన్నై అపోలో ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నామని అపోలో ఆస్పత్రికి చెందిన ప్రముఖ న్యూరోసర్జన్ శ్రీనివాసన్ పరమశివం అన్నారు. స్థానిక లక్ష్మీపురం సర్కిల్లోని అపోలో ఆస్పత్రిలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. బ్రెయిన్ స్ట్రోక్‌ను మొదటి దశలో గుర్తిస్తే వైద్య అందించడం సులువుగా ఉంటుందన్నారు. అదే రెండో దశలో మెదడులో నుంచి రక్తం బయటకు వచ్చినప్పుడు ఆ రోగిని బతికించడం అతిక్లిష్టమైన విషయ మన్నారు. రెండో దశలో ఉన్న రోగిని కూడా 24 గంటల్లో చెన్నై అపోలో ఆస్పత్రికి తీసుకువస్తే అధునాతన వైద్య పద్ధతులతో యాంజీగ్రామ్ చేసే విధంగా నరాల ద్వారా చిన్నపాటి తీగను మెదడు భాగం వరకు పంపి వైద్యం అందించి రోగిని బతికించేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో న్యూరో ఫిజీషియన్ కార్తికేయన్ పాల్గొన్నారు.

పరివర్తనతో కేసుల మాఫీ

నారాయణవనం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సారా తయారీకి దూరంగా ఉంటూ స్వయం ఉపాధి దిశగా మార్పు చెందితే పాత కేసులను దశల వారీగా మాఫీ చేయిస్తామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్ పేర్కొన్నారు. తిరువట్యంలో శనివారం నవోదయం 2.0 సమావేశాన్ని నిర్వహించారు. చదువుకున్న యువతకు ఉద్యోగావకాశాలు, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, స్వయం ఉపాధికి బ్యాంకుల నుంచి రుణసాయం అందిస్తామని తెలిపారు. గ్రామ పెద్దలు సొరకాయలు, తిరువేంగడం మాట్లాడుతూ... గతంలో అధికారులు తమ హామీలను నిలబెట్టుకోలేదన్నారు. రెవెన్యూ, ఫారెస్ట్ బఫర్ భూముల్లో వ్యవసాయానికి ఇచ్చిన భూములపై ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని వాపోయారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఉప సర్పంచ్ చీరాలయ్య, ఎస్ఐలు అంజద్‌బాషా పాల్గొన్నారు.

జ్ఞాన పరంపరపై ముగిసిన వర్క్‌షాప్



అధికారులు, ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ఎస్వీయూలోని మాలవ్య శిక్షణ కేంద్రంలో నిర్వహించిన భారతీయ జ్ఞాన పరంపర వర్క్‌షాప్ ముగిసింది. ముగింపు సభలో పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి మాట్లాడారు. ప్రాచీన భారతీయ సంపదైన ఆయుర్వేదం, నీటి సంరక్షణ, వ్యవసాయం, గురుకుల విద్య వంటి అంశాలను ఆధునిక సమాజానికి అనుసంధానించాలన్నారు.అనోల్ ఆంద్రే మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ విజయవంతంగా సాగిందన్నారు. ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

సాలకట్ల తెప్పోత్సవాలకు సిద్ధమైన తెప్ప



ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు జరుగనున్న సాలకట్ల తెప్పోత్సవాల సందర్భంగా తెప్ప సిద్ధమైంది. తొలిరోజు సీతలక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి తెప్పపై కొలువుదీరి పుష్కరిణిలో మూడుచుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేస్తారు. రెండవరోజు రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి మూడుస్లార్లు విహరిస్తారు. మూడోరోజు మలయప్పస్వామి మూడుసార్లు, నాల్గో రోజు ఐదు సార్లు, చివరిరోజు ఏడుసార్లు తెప్పపై విహరించి భక్తులను కటాక్షిస్తారు. రోజూ రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య తెప్పోత్సవాలను నిర్వహించనున్నారు. తెప్ప నీటిలో సులువుగా తేలాడేలా నీటి బాక్స్‌లను అమర్చి చెక్కలతో మండపాన్ని సిద్ధం చేశారు. శనివారం తెప్పకు విద్యుత్ అలంకరణ పనులు మొదలుపెట్టారు. -తిరుమల,ఆంధ్రజ్యోతి

మిథనాల్, ఫార్మా కంపెనీలపై ఎక్సైజ్ దాడులు

లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాలని ఆదేశాలు



రేణిగుంట మిథనాల్ కంపెనీలో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మిథనాల్, ఫార్మా కంపెనీలు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి ఆదేశించారు. శనివారం జిల్లా పరిధిలోని తిరుపతి, రేణిగుంట, గాజులమండ్యం ప్రాంతాల్లో ఉన్న ఏపీ డ్రగ్స్, రేడియంట్ ఫార్మా కంపెనీ, క్రోమో మెడికల్ కేర్ ఫార్మా, మల్లాడి డ్రగ్స్, గ్లోరీ ఫార్మా, ఇండియన్ పొటాష్, ఓఆర్ డిస్టలరీ కంపెనీలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అసిస్టెంట్ ఈఎస్ వాసుదేవ చౌదరి, రూరల్ సీఐ నరసనాయుడు, ఎస్ఐలు కవీశ్వరనాయుడు, అంజలి ప్రసన్న, సిబ్బంది బృందాలుగా విడిపోయి ఏకకాలంలో దాడులు చేశారు. మొలాసిస్ తయారీ, వివిధ రకాల మందులు తయారు చేసే విధానం, ఫార్మా కంపెనీల పనితీరుపై ఆరా తీశారు. నిబంధనల మేరకు డ్రగ్స్ తయారు చేస్తున్నారా లేదా అని రికార్డులు పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న మిషనరీ ఆపరేటర్లు, ట్యాబ్ టెక్నీషియన్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, మేనేజర్లను విచారించారు. నిబంధనలు అతిక్రమించి పనిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈఎస్ హెచ్చరించారు. అనంతరం ఫ్యాక్టరీల లైసెన్సులను తనిఖీ చేశారు. అనుమతి పొందిన మందులు మాత్రమే తయారు చేయాలని ఆదేశించారు.

చంద్రబాబుకు స్వాగతం, వీడ్కోలు



ముఖ్యమంత్రికి వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు

రేణిగుంట, మార్చి1,(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విమా నాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు పర్యటనలో భాగంగా శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక విమానంలో విమానాశ్రయం చేరుకున్న ఆయనకు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, నగరపాలక సంస్థ కమి షనర్ మౌర్య, జేసీ శుభం బన్సల్, శ్రీకాళహస్తి, చంద్రగిరి, పూతలపట్టు, సత్యవేడు ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, పులవర్తి నాని, మురళి మోహన్, కోనేటి ఆదిమూలం, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర యాదవ కార్పొ రేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, జనసేన ఇన్‌చార్జ్ కోట వినుత, ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి తదితర అధికారులు ప్రజాప్రతిని స్వాగతం పలికారు. అనంతరం సీఎం ప్రత్యేక హెలికాప్టర్లో గంగాధర నెల్లూరుకు బయలుదేరి వెళ్లారు.

ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డుకి సాదర వీడ్కోలు లభించింది. శనివారం గంగాధర నెల్లూరులో పర్యటన ముగించుకొని 6 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్లో విమానాశ్రయం చేరుకున్న ఆయనకు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, మాజీ మంత్రి పరసారత్నం, మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు వీడ్కోలు పలికారు.

దళిత ఉద్యోగి పదోన్నతికి సహకరించండి



మాట్లాడుతున్న చింతమాకుల పుణ్యమూర్తి

తిరుపతి (లీలామహల్), మార్చి1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపాలిటీలో జనన, మరణ రిజిస్ట్రేషన్ శాఖలో పనిచేస్తున్న దళిత ఉద్యోగి లక్ష్మీదేవి పదోన్నతికి పాలకులు, అధికారులు సహకరించాలని అఖిలభారత అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతమాకుల పుణ్యమూర్తి కోరారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ స్టాడింగ్ కమిటీలో ప్రతిపాదన పెట్టాక గత ఏడాది ఎన్నికల కోడ్ సమయంలో ఆపేశారన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చినా ఈ విష యంపై తీర్మానం చేయకపోవడం అన్యాయమన్నారు. గత నెల 20న జరిగిన కౌన్సిల్‌లో ఆమోదిం చలేదన్నారు. ఈ విషయమై శుక్రవారం కమిషనర్ మౌర్యతో మాట్లాడగా దీనిపై ప్రభు త్వానికి లేఖ రాస్తామని చెప్పారని విచారం వ్యక్తం చేశారు. జీవో నెంబరు 78 ప్రకారం పదోన్నతి కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో రెడ్డెప్ప, మంజునాథ్, వెంకటేష్, వినాయకబాబు, సుబ్రహ్మణ్యం, కళావతమ్మ, శ్రీవల్లి పాల్గొన్నారు.

సొంత వాహనాలను ట్యాక్సీలుగా ఉపయోగించరాదు



మాట్లాడుతున్న డీటీవో మురళీమోహన్

తిరుపతి (జీవకోన), మార్చి 1(ఆంధ్రజ్యోతి): సొంత వాహనాలను ట్యాక్సీలుగా ఉపయోగిస్తే ఆ వాహనాలను సీజ్ చేస్తామని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీ మోహన్ అన్నారు. శనివారం రవాణాశాఖ కార్యాలయంలో టాక్సీ, క్యాబ్, వాహన డ్రైవర్లు, యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉబర్ సంస్థలో ఉన్న టాక్సీ, క్యాబ్ డ్రైవర్లు కొన్ని రోజులుగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను రవాణాశాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వాహనాలకు తగినంత కిరాయి రావడంలేదని, ప్రధానంగా తిరుపతి విమానాశ్రయంలో పార్కింగ్ వసతి కల్పిం చడంలేదని తెలిపారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, ఏవో విజయప్రశాంతి, ఉబర్ వాహన యాజమాన్య కమిటీ సభ్యులు రమేష్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మురళి, ఎల్లయ్య, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటరమణ జయంతి



తిరుపతి, మార్చి1(ఆంధ్రజ్యోతి): దివంగత ఎమ్మెల్యే వెంకటరమణ 78వ జయంతి శనివారం కపిలతీర్థం రోడ్డులోని ఆయన ఘాట్ వద్ద ఘనంగా జరిగాయి. వెంకటరమణ సతీమణి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కుటుంబ సమేతంగా అక్కడ నివాళులు అర్పించారు. అనంతరం రుయా ఆస్పత్రి ఎదుట పెద్దఎత్తున అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, నాయకులు బీటీ. కీర్తి, జేబీ శ్రీనివాస్, శ్రీహరినాయుడు, దంపూరి భాస్కర్ యాదవ్, బుల్లెట్ రమణ, మహేష్ యాదవ్, కృష్ణయాదవ్, బ్యాంకు శాంతమ్మ, ఆముదాల తులసీరాం, కొట్టె హేమంత్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



తిరుపతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీలో భాగంగా 35వ డివిజన్లో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ శనివారం లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఆదరణ వృద్ధాశ్రమం, ఏడీ బిల్డింగ్ రోడ్డు, వెంకటగిరి క్వార్టర్స్ వద్ద పింఛన్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎస్వీఎం శ్రీధర్, జగ్గా, లక్ష్మీ, రవితేజ నాయుడు, సురేష్, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి వద్దకే పింఛన్



తిరుపతి అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రిజర్వాయర్ కాలనీకి చెందిన వృద్ధురాలు పార్వతమ్మ అనారోగ్యంతో స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సచివాలయ విద్యాకార్యదర్శి పవన్‌కుమార్ ఆస్పత్రికి చేరుకొని ఆమెకు పెన్షన్ అందజేశారు. ఆమె అతనికి కృతజ్ఞతలు తెలియజేసింది.

ప్లాస్టిక్ రహితంగా తిరుపతిని మార్చుదాం

తిరుపతి, మార్చి1(ఆంధ్రజ్యోతి): తిరుపతిని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్లాస్టిక్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ శనివారం స్థానిక అన్నమయ్య కూడలి నుంచి దండి మార్చ్ (ఎమ్మార్ పల్లి) కూడలి వరకు ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా గుడ్డ బ్యాగులు, పేపర్ కవర్లు వినియో గించేలా ప్రజలకు దుకాణదారులు అవగాహన కల్పించాలన్నారు. ఈ ర్యాలీలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గృహ విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు రాయితీ

తిరుపతి(ఆటోనగర్) మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలో గృహవిద్యుత్ వినియోగదారుల సౌలభ్యం కోసం అదనపు లోడు క్రమబద్ధీకరణకు సంస్థ 50 శాతం రాయితీ కల్పిస్తుందని సీఎండీ కె.సంతోషరావు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వినియోగదారులు ఇంటి సర్వీసు తీసుకున్న సమయంలో అంగీకరించిన లోడు కంటే, ఎక్కువ లోడు వినియోగిస్తున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ రాయితీ కోసం శనివారం నుంచి జూన్ 30లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

సారా తయారీ వద్దు : ఈఎస్



నవోదయం కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఈఎస్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సారా తయారీ, వినియోగం, విక్రయాలు పూర్తిగా అరికట్టి తయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి కోరారు. శ్రీకాళహస్తి మండలం మేలచ్చూరు, నారాయణవనం మండలం తిరువట్టంలో, ఎర్రావారిపాళెం మండలం వేములవాడ గ్రామంలో ఎక్కువగా సారా తయారీ, విక్రయాలు జరుగుతున్న నేపథ్యంలో ఆయా గ్రామాల్లో శనివారం నవోదయం కార్యక్రమం నిర్వహించారు. తిరువట్టంలో ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి, మేలచ్చూరులో ఏఈఎస్ వాసుదేవచౌదరి, రూరల్ సీఐ నరసనాయుడు, సీఐ లావణ్య సిబ్బంది, ఎర్రావారిపాళెం వేములవాడలో చంద్రగిరి సీఐ ఫణీంద్ర సారా తయారీదారులు, వినియోగదారులతో మాట్లాడారు. సారా తయారీ మానుకోవాలని సూచించారు. కుటీర పరిశ్రమలకు సంబంధించి యూనిట్లు కోరితే ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు.

రేపటి నుంచి ఆలిండియా పోస్టల్ క్యారమ్ టోర్నీ

తిరుపతి(క్రీడలు), మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఏపీ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 7వరకు నుంచి తిరుపతిలో 27వ ఆలిండియా పోస్టల్ క్యారమ్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. స్థానిక ఇందిరా మైదానంలోని మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఆంధ్రా, తెలంగాణ, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్, కర్ణాటక, రాజస్థాన్‌ల నుంచి 105మంది తపాల ఉద్యోగులు ఈ పోటీల్లో తలపడనున్నారు.



సైన్స్‌కు విలువ పెంచిన ఫిజిక్స్ పరిశోధనలు

ప్రొఫెసర్ దేవప్రసాదరాజు



సభలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ దేవప్రసాదరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఫిజిక్స్ పరిశోధనలు శాస్త్రీయ విజ్ఞాన రంగానికి అదనపు విలువను చేకూరుస్తున్నాయని ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాదరాజు పేర్కొన్నారు. సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైన్స్‌లో ఫిజిక్స్ పరిశోధనలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఫిజిక్స్ పరిశోధనల ద్వారా కొత్త ఆవిష్కరణలు సమాజానికి గొప్ప ప్రయోజనాన్ని కలిగించడమే ఇందుకు కారణమన్నారు. యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలోనూ ఎంతో గొప్ప పరిశోధనలు జరిగాయని తెలిపారు. సైన్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా పరిశోధనలు కొత్త మార్గంలో సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ ప్రొఫెసర్లు హుస్సేన్, విజయభాస్కరరావు, అపర్ణ, రాజగోపాలరెడ్డి, విజయలక్ష్మి, వెంకటరమణ రెడ్డి, హేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నాచెరువు వేలం మళ్లీ వాయిదా

తిరుపతి అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతం శెట్టిపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని అన్నాచెరువుకు చేపల వేలం మళ్లీ వాయిదా పడింది. ఔత్సాహికులు ఎవరూ ముందుకురాకపోవడంతో శనివారం రెండోసారి వేలం ఆగిపోయింది. చివరి అవకాశంగా మంగళవారానికి వాయిదా వేశామని, ఆ రోజు కూడా టెండర్ ఖరారు కాకపోతే కలెక్టర్‌కు నివేదిస్తామని సచివాలయ కార్యదర్శి మురళి తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం



వెంకటేశులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఎంబీఏ పరిశోధకులు ఎం. వెంకటేశులు డాక్టరేట్ పొందారు. 'అసెస్‌మెంట్ ఆఫ్ మార్కెటింగ్ చాలెంజెస్ కాంఫ్రొంటెడ్ బై ఫార్మాసూటికల్ కంపెనీస్ ఇన్ ఇండియా' అంశంపై ప్రొఫెసర్ రఘునాథ రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

అనుమతులు లేకుండా భవనాలు నిర్మించరాదు

తిరుపతి, మార్చి1(ఆంధ్రజ్యోతి): నగరంలో అనుమతులు లేని భవనాలు నిర్మించరాదని ఒక వేళ ఎక్కడైనా నిర్మిస్తున్నట్లు తెలిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ మౌర్య టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం నగరంలోని 19వ వార్డు కార్పొరేటర్ ఆరణి సంధ్య, ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి న్యూ బాలాజి కాలని, టీటీడీ ప్లాట్లు, ఎస్‌కేడీ నగర్, వైకుంఠపురం పార్కు, రాస్ బిల్డింగ్, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు తదితర ప్రాంతాల్లో భవన నిర్మాణాల అనుమతులను, పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని సూచించారు. మురుగునీటి కాలువల మరమ్మతులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ తులసికుమార్, డీఈలు మహేష్, లలిత, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

తనిఖీ



తిరుపతిలో శనివారం ఉదయం సామాజిక పింఛన్ల పంపిణీని అధికారులు చేపట్టారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని కమిషనర్ మౌర్య పరిశీలించారు.

నిరంతరం బస్సు కండిషన్ తనిఖీ చేయాలి

అధికారులతో ఈడీ చెంగల్‌రెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న ఈడీ చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బస్సు కండిషన్ విషయంలో నిరంతరం తనిఖీలు చేయాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.చెంగల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక డీపీటీవో కార్యాలయంలో జిల్లా ఆర్టీసీ అధికారులతో సమీక్షించారు. ఇటీవల ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ ప్రమాదాలకు గల కారణాలపై చర్చించారు. మెకానిక్, గ్యారేజీ, స్వీపింగ్, వాషింగ్ సిబ్బంది కూడా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రతి నెలా బస్సు కండిషన్ తనిఖీచేసి లోపాలను గుర్తించాలన్నారు. పాడైన విడిభాగాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ కొత్తగా అమర్చాలన్నారు. ప్రతినెలా 1, 2, 3 తారీఖుల్లో డ్రైవర్ల నుంచి వారు నడిపే బస్సు, రోడ్డు సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. 4, 5, 6, 7తేదీల్లో ఆ సమస్యలను పరిష్కరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బస్టాండులలో కామన్ టాయిలెట్స్ మెరుగ్గా ఉండాలని, తాగునీటి కొరత లేకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అలిపిరి డ్రైవర్స్ క్వార్టర్స్ వద్ద నిర్మిస్తున్న అధునాతన ఆస్పత్రి ఏప్రిల్‌లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. త్వరలో రాష్ట్రానికి 750ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని, అందులో 50 మంగళం డిపో పరిధిలో తిరుపతి -తిరుమల మధ్య నడుస్తాయన్నారు. డిపో చార్జింగ్ స్టేషన్, సబ్‌స్టేషన్, ఇతరాల ఏర్పాట్లు ప్రారంభించామన్నారు. ఈ సమీక్షలో డీపీటీవో జి.నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, ఏటీఎం రామచంద్రనాయుడు, డీఎంలు ప్రశాంతి, భాస్కర్, హరిబాబు, చాందిని పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు ఆక్యుపంక్చర్ చక్కటి పరిష్కారం



మాట్లాడుతున్న డాక్టర్ ఎంఎస్ బాలాజీ

తిరుపతి(వైద్యం), మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులకు ఆక్యుపంక్చర్ వైద్యం ఒక చక్కటి పరిష్కారమని అలాంటి వైద్యాన్ని ప్రజలకు చేరువ చేసిన ఆక్యుపంక్చర్ నిపుణుడు బీకే బసును స్మరించుకోవడం మన బాధ్యతని ఆక్యుపంక్చర్ వైద్యుడు ఎంఎస్ బాలాజీ అన్నారు. ఆక్యుపంక్చర్ ఆద్యుడు డాక్టర్ బీకే బసు 113వ జయంతి సందర్భంగా స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో ఆక్యుపంక్చర్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైనా విప్లవంలో గాయాలైన సైనికులకు బీకే బసు ఆక్యుపంక్చర్ సేవలను అందించి వారి ప్రాణాలను నిలబెట్టారన్నారు. ప్రజలకు నిస్వార్థంగా వైద్య సేవలు అందించిన వ్యక్తి బీకే బసు అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితోనే తిరుపతిలో వారానికి ఒక రోజు ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు రవీంద్ర, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి నాగార్జున, బాలోత్సవం అధ్యక్షులు దామోదరం, రాఘవ పాల్గొన్నారు.



తిరుమలేశుడి సేవలో
నటి మెహరీన్

సినీ నటి మెహరీన్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున సుప్రభాతసేవలో ఆమె పాల్గొన్నారు. సుప్రభాత పఠనం పూర్తికాగానే గర్భాలయానికి చేరుకుని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా, ఆలయం ముందు మెహరీన్‌ను చూసేందుకు సినీ అభిమానులు ఉత్సాహం చూపారు. ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ముక్కంటి సేవలో
నటి హన్సిక



జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం సినీ నటి హన్సిక దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఆమెకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆమెను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

నేడు స్థానికుల దర్శన కోటా టోకెన్ల జారీ

ప్రతినెలా మొదటి మంగళవారం తిరుపతి, తిరుమల స్థానికులకు కల్పించే శ్రీవారి దర్శన కోటా టోకెన్లను టీటీడీ ఆదివారం జారీ చేయనుంది. ఈ నెల 4వ తేదీన టీటీడీ స్థానికులకు దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. తిరుపతి వాసులకు మహతి ఆడిటోరియంలోని కౌంటర్లలో, తిరుమల స్థానికులకు బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో మొదట వచ్చిన వారికి మొదట ప్రాతిపదికన ఆదివారం ఉదయం 5 గంటల నుంచి టోకెన్లు జారీ చేయనున్నారు. తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన స్థానికులు తమ ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందవచ్చు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


శ్రీవారి సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.3.24 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 52,731

తలనీలాలు సమర్పించినవారు: 17,664





పెరిగిన మల్బరీ తోట

సెరికల్చర్‌తో లాభాల సిరి
పుత్తూరు మండలంలో పెరుగుతున్న సాగు

మనసుంటే మార్గం ఉంటుందంటారు. పుత్తూరు మండలంలో కొంతమంది రైతుల సాగుతీరు పరిశీలిస్తే ఈమాట అక్షరాలా నిజం. ఏటా సంప్రదాయ పంటలే సాగుచేయడం, నష్టాలను చవిచూడడం చాలామంది రైతులకు అలవాటు. దీని నుంచి బయటపడటానికి ఆసక్తి చూపించరు. ఫలితంగా ఏటేటా నష్టాలను మూటగట్టుకుంటారు. కానీ గొల్లపల్లి, రామకృష్ణాపురం, కొండల్‌చెరువు గ్రామాల్లో కొందరు రైతులు భిన్నంగా ఆలోచించారు. కొత్త ఒరవడికి స్వాగతం పలికారు. నష్టాల భారాన్ని దించుకున్నారు. నెమ్మదిగా లాభాలబాట పట్టారు. ఈ రైతుల బతుకుల్లో ఆనందాల సిరులు పంచుతున్నది సెరికల్చర్ సాగు.

-పుత్తూరు,ఆంధ్రజ్యోతి

పుత్తూరు మండలంలో వాస్తవానికి సెరికల్చర్ (మల్బరీ లేక పట్టుగూళ్లు)కు 1978లోనే అడుగులు పడ్డాయి. నాటి ఎమ్మెల్యే కేబీ సిద్ధయ్య రాష్ట్ర సెరికల్చర్ బోర్డు ఛైర్మన్‌గా నియమితులయ్యాక కరువుకాటకాల్లో మునిగి తేలుతున్న రైతులకు సెరికల్చర్ ప్రత్యామ్నాయ మార్గమని నమ్మి ఈ సాగును పరిచయం చేశారు. దీంతో పలువురు రైతులు పట్టుగూళ్ల పెంపకానికి శ్రీకారం చుట్టారు. లాభాలను తొలిసారిగా రుచి చూశారు. అయితే కాలక్రమేణా ఈ రంగానికి ప్రోత్సాహం కొరవడడంతో రైతులు మళ్లీ పాత పంటల సాగుకే మొగ్గు చూపారు. అయితే కొన్నాళ్లుగా సెరికల్చర్‌కు ప్రభుత్వం నుంచి చేయూత పెరిగింది. ఫలితంగా రైతులు పట్టుపురుగుల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. మామిడి, వరి, చెరకు వంటి పంటల సాగుతో చేతులు కాల్చుకుంటున్నామని గ్రహించి మల్బరీ వైపు చూస్తున్నారు.



గూళ్లను ఏరుతున్న కూలీలు



షెడ్డులో బెడ్డులు

సాగు విధానమిలా..

పొలాన్ని దుక్కి దున్ని మల్బరీ కొమ్మలను బోదెల్లో నాటాలి. ఎక్కువ నీరు అవసరం ఉండదు. సేంద్రియ ఎరువులు, వేపనూనెను వినియోగించి డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందించాలి. షెడ్డును, లోపల ఇనుప స్తంభాలతో మూడు లేక నాలుగు అంచెల బెడ్లు నిర్మించుకోవాలి. షెడ్డులో ఉష్ణోగ్రతలను నియంత్రించేందుకు వేసవిలో నీడనిచ్చే చెట్లు చుట్టుపక్కలా పెంచాలి. శీతాకాలంలో కిటికీలను గోనె సంచులతో మూసివేయాలి. ఉష్ణోగ్రత గుర్తించేందుకు షెడ్డులో కొలమానిని వుంచుకోవాలి. మల్బరీ చెట్లు ఏపుగా పెరిగాక అయిదు రోజుల పట్టు పురుగులను (చాకీ సెంటర్) పెంపకందారుల నుంచి తీసుకువస్తారు. ఎకరానికి 125 గుడ్లను తీసుకుంటే నూగు గింజల సైజులో గుడ్డునుంచి సగటున 600 పురుగులుంటాయి. వీటిని బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రపరచి షెడ్డులోని బెడ్డు మీద చేర్చాలి. రెండు పూటలా మల్బరీ ఆకులను కత్తిరించి పురుగులకు ఆహారంగా వేయాలి. పురుగు సైజు పెరిగే కొద్దీ మల్బరీ ఆకు కొమ్మలను బెడ్డు మీద ముందుకు జరుపుతూపోవాలి. పట్టు గూళ్లు తయారయ్యే ఇరవై రోజుల వ్యవధిలో మూడు సార్లు నిద్రావస్థ (జ్వరం) సమయంలో పురుగు ఆహారం తీసుకోదు. సైజు పెరగని పురుగులను పరిశీలిస్తూ తొలగించాలి. 20 రోజుల తర్వాత వలలో పెట్టిన గూళ్లను సేకరించి బాక్సులతో మార్కెట్‌కు చేరవేయాలి. ధరను బట్టి కిలోల లెక్కన అధికారులు ఈ బాక్సులను వ్యాపారులకు అప్పజెప్పి మర్నాడే నగదును రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. పంట పూర్తయ్యాక షెడ్డును శుభ్రపరిచి మరో పంటకు సమాయత్తం కావాలి.

మరింత ప్రోత్సాహం అవసరం



ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీతో పాటు మరిన్ని వసతులను కల్పిస్తే సాగు ఖర్చులు తగ్గి రాబడి పెరుగుతుంది. షెడ్డు, బెడ్లు, వలలకు సబ్సిడీ అందుతోంది. మల్బరీ మొక్కల సాగు, ఆకుల కత్తిరింపులో పెట్టుబడుల ఖర్చును తగ్గించేందుకు చిన్న ట్రాక్టర్లు, కట్టర్లు, వేపనూనె, బ్లీచింగు పౌడరు, సున్నం వంటి వాటిని ప్రభుత్వం అందిస్తే బాగుంటుంది.పలమనేరు,మదనపల్లెలతో పాటు మరికొన్ని చోట్ల పట్టు గూళ్ల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తే రవాణా ఖర్చులు ఆదా అవుతాయి.

- మునిబాలకృష్ణయ్య,గొల్లపల్లి

తక్కువ వ్యవధిలో ఎక్కువ లాభాలు



సాధారణంగా ఏడాదికి తొమ్మిది పంటలు తీసుకోవచ్చు. తక్కువ వ్యవధిలోనే సాగుకు వీలున్న పంట ఇది. ఎకరాకు దాదాపు రూ.5 లక్షలు ఆర్జిస్తున్నట్లు కొందరు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పుత్తూరు మండలంలో 30 ఎకరాలకుపైగా మల్బరీ సాగు చేస్తున్నారు. భవిష్యత్‌లో సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుంది.

- శిరీష, సెరికల్చర్ అధికారిణి

గాజులమండ్యం నుంచి శ్రీసిటీ మీదుగా తడకు కొత్త రోడ్డు

- గతేడాది సీఎం ఆదేశాలతో తాజాగా సర్వేకు నిర్ణయం
- అధ్యయనానికి రూ.1.775 కోట్లు మంజూరు

తిరుపతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయం నుంచి శ్రీసిటీకి నేరుగా రోడ్డు సదుపాయం కల్పించాలంటూ గతేడాది సీఎం నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు చేసిన ఆదేశం ఇపుడు కార్యరూపం దాల్చుతోంది.అందులో భాగంగా రోడ్డు నిర్మాణంపై డీపీఆర్ రూపొందించేందుకు ప్రభుత్వం తాజాగా రూ.1.775 కోట్లు మంజూరు చేసింది. డీపీఆర్ రూపొందించే కన్సల్టెన్సీని ఎంపిక చేయాల్సిందిగా ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులను ఆదేశించింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.గతేడాది నవంబరులో సీఎం చంద్రబాబు స్వగ్రామమైన నారావారిపల్లికి వచ్చిన సందర్భంలో జిల్లా అభివృద్ధిపై కలెక్టర్ వెంకటేశ్వర్‌తో చర్చించారు. ఆ సమయంలో ప్రత్యేకించి జిల్లాలో కొన్ని కొత్త రోడ్ల నిర్మాణానికి సంబంధించి సూచనలు చేశారు. వాటిలో రేణిగుంట విమానాశ్రయం నుంచి నేరుగా శ్రీసిటీకి రోడ్డు నిర్మించాలనేది ఒకటి. ఇప్పటివరకూ ఎయిర్‌పోర్టు నుంచి లేదా తిరుపతి నుంచి శ్రీసిటీ చేరుకోవడానికి శ్రీకాళహస్తి మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ట్రాఫిక్ కూడా ఇబ్బందికరంగా ఉంటోంది. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు,దేశ విదేశాలకు చెందిన ప్రభుత్వాల, పరిశ్రమల ప్రతినిధులు తరచూ శ్రీసిటీని సందర్శిస్తున్న నేపథ్యంలో వారికి రాకపోకలు సుగమం చేయాలని సీఎం సూచించారు. దానికోసం రేణిగుంట విమానాశ్రయం నుంచి శ్రీసిటీకి నేరుగా కనెక్టివిటీ ఉండేలా కొత్తగా రోడ్డు నిర్మిస్తే బాగుంటుందని సీఎం సూచించారు.దీనిపై జిల్లా ఆర్ అండ్ బీ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలసి ప్రాథమిక అధ్యయనం చేసిన కలెక్టర్ విమానాశ్రయానికి చేరువగా ఉన్న ఎన్‌హెచ్ 716పై గాజులమండ్యం నుంచి గుడిమల్లం, కాట్రపల్లి, శ్రీసిటీల మీదుగా తడలోని కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి అయిన ఎన్‌హెచ్-16ను కలుపుతూ కొత్త రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. ఆర్ అండ్ బీ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్, ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీలు సమీక్షించి రోడ్డు నిర్మాణానికి కన్సల్టెన్సీని నియమించి డీపీఆర్ రూపొందించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. పబ్లిక్, ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ ప్రాతిపదికన రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు.దానికోసం రూ.1.775కోట్లు అవసరమవుతుందని అంచనా వేశారు. ఆ మేరకు ప్రభుత్వం రూ.1.775కోట్లు మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సాంకేతికంగానూ, ఆర్థికంగానూ రోడ్డు నిర్మాణానికి గల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి డీపీఆర్ రూపొందించేందుకు ఓపెన్ కాంపిటీటివ్ బిడ్డింగ్ పిలిచి కన్సల్టెన్సీని ఎంపిక చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో ఆదేశించింది.ఇది పూర్తయితే జిల్లాలో రోడ్డు కనెక్టివిటీకి సంబంధించి ఇదో ప్రధాన మలుపు కానుంది.

శ్రీసిటీలో షార్ 'స్పేస్ ఆన్ వీల్స్' ఎగ్జిబిషన్

శ్రీసిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇస్రోకు సంబంధించిన సమాచారంతో పాటు అంతరిక్ష సాంకేతికతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేలా శ్రీసిటీ, శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) ఆధ్వర్యంలో శ్రీసిటీలో స్పేస్ ఆన్ వీల్స్ మొబైల్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. శుక్ర, శనివారాల్లో సాగిన ప్రదర్శనలో స్థానిక ట్రిపుల్ ఐటీ, క్రియా యూనివర్సిటీ, అకార్డ్ స్కూల్, చిన్మయ విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి ఉపగ్రహ ప్రయోగ వాహనం నుంచి తాజా పురోగతి వరకు వివిధ ప్రయోగాలు, లాంచ్‌ప్యాడ్‌లు, చంద్రయాన్, మంగళయాన్, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్లు, ఇండియన్ రీజనల్ సెన్సింగ్ అప్లికేషన్లు, శాటిలైట్ కమ్యూనికేషన్ టెక్నాలజీకి సంబంధించిన నమూనాలను ప్రదర్శించారు. అవకాశం కల్పించిన షార్ డైరెక్టర్ రాజరాజన్‌కు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, షార్ అధికారి కిరణ్ ఆధ్వర్యంలో బృందం ఇస్రోకు సంబంధించిన వివిధ ప్రయోగాలను విద్యార్థులకు అవగాహన కలిగేలా వివరించారు.



నమూనాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

పుత్తూరు మున్సిపాలిటీలో అక్రమాలపై విచారణ

- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే ఫిర్యాదు
- పురపాలక శాఖ ఆర్డీ విశ్వనాథ్ నేతృత్వంలో దర్యాప్తు

పుత్తూరు అర్బన్, మార్చి1(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో 2019-24 మధ్యకాలంలో రూ.కోట్లలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పురపాలక శాఖ రీజనల్ కో-ఆర్డినేటర్ విశ్వనాథ్ నేతృత్వంలో విచారణకు కమిటీ నియమించారు. ఇప్పటికే మున్సిపాలిటీలో కమిటీ గోప్యంగా విచారణ కొనసాగిస్తోంది. కమిషనర్ వెంట్రామిరెడ్డి హయాంలో చోటుచేసుకున్న అక్రమాలపై దృష్టి సారించింది. అందుకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేస్తున్నారు. 2021మే 18వ తేదీన కుంగిన ఎస్ఎస్ ట్యాంకు కట్ట మరమ్మతులకు రూ.5లక్షలైనా ఖర్చవలేదు. కానీ సాధారణ నిధుల నుంచి రూ.12లక్షలు ఖర్చు అయినట్లు బిల్లులు పెట్టారు. మున్సిపల్ నూతన భవన నిర్మాణ పనులు కాంట్రాక్టరుకు అప్పగించాక సాధారణ నిధుల నుంచి డబ్బు డ్రా చేయడం అప్పట్లో విమర్శలకు దారితీసింది. మూలనపడ్డ వాహనాల విక్రయాల్లో జరిగిన అక్రమాలపైనా విచారణ జరుపుతున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో ఇష్టారాజ్యంగా బిల్లులు ఆమోదం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో విచారణ ద్వారా నిజాలు నిగ్గుతేల్చనున్నారు. ఆదివారమూ విచారణ కొనసాగనుంది.

ఇంటర్ పరీక్షల ఏర్పాట్లు చేస్తూ..
గుండెపోటుతో జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మృతి



జగన్మోహనాచార్యులు (ఫైల్)

సత్యవేడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమైన సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహనాచార్యులు (54) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. శనివారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానుండడంతో పరీక్షల ప్రధాన అధికారిగా ఆయన శుక్రవారం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పనులు పూర్తయ్యే సరికి పొద్దుపోయింది. ఇంటికి (తిరుపతికి) వెళ్లకుండా రాత్రి కాలేజీలోనే బసచేశారు. అర్ధరాత్రి సమయంలో గుండెపోటు రావడంతో స్పృహ కోల్పోయారు. గమనించిన సిబ్బంది ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందారు. తిరుపతిలోని ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు కళాశాలకు చేరుకుని మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. ప్రిన్సిపాల్ మరణంతో కళాశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన స్వస్థలం కడప జిల్లా జమ్మలమడుగు మండలం. 2023లో బదిలీపై ఇక్కడకు వచ్చారు.

బ్లిస్ హోటల్‌కు బాంబు బెదిరింపు



హోటల్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బ్లిస్ హోటల్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి.హోటల్‌ను బాంబులతో పేల్చివేస్తామని హెచ్చరిస్తూ మేనేజర్‌కు మెయిల్ రావడంతో వెంటనే అప్రమత్తమయ్యారు. మెయిల్ ఐడీని తిరుపతి ఈస్ట్ సీఐ రామకృష్ణకు పంపారు. ఆయన బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో కలిసి హోటల్లో అణువణువునా తనిఖీలు చేశారు. అన్ని గదులు, రిసెప్షన్, వంటగదులు, వాష్‌రూములు, మేనేజర్ చాంబర్‌ను తనిఖీ చేసి ఎలాంటి పేలుడు పదార్థాలూ లేవని నిర్ధారించారు. దీంతో హోటల్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

టీడీపీ నేతల నడుమ 'మట్టి' యుద్ధం

- ఓ వర్గం అక్రమ తవ్వకాలపై మరో వర్గం ఫిర్యాదు
- నాలుగు టిప్పర్లను పట్టుకున్న పోలీసులు
- ఓ నేత జోక్యంతో రెండింటి విడుదల... మరో నేత ఒత్తిడితో తిరిగి స్వాధీనం
- ఈసారి నాలుగింటినీ విడిపించుకెళ్లిన వైనం
- గాజులమండ్యం స్టేషన్‌లో వారం రోజులుగా పంచాయితీ

రేణిగుంట,మార్చి1(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలో కొందరు టీడీపీ నేతల నడుమ మట్టి యుద్ధం నడుస్తోంది. గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ వేదికగా వారం రోజుల నుంచి సాగుతున్న ఆధిపత్య పోరు మండల వ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గత ఆదివారం రాత్రి మండలంలోని కొట్రకోనకు చెందిన టీడీపీ నాయకుడొకరు నాలుగు టిప్పర్లలో గాజులమండ్యం చెరువు నుంచి మట్టి అక్రమంగా తరలిస్తున్నారు. గాజులమండ్యం గ్రామానికి చెందిన టీడీపీ నేత, ఆయన అనుచరులు గాజులమండ్యం పోలీసులకు సమాచారం ఇచ్చారు. చెరువు వద్దకు వచ్చిన పోలీసులు మట్టి తరలిస్తున్న నాలుగు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మట్టి దందా చేపట్టిన నాయకుడు మండల స్థాయి నేతను ఆశ్రయించారు. ఆ నేత సోమవారం ఉదయం గాజులమండ్యం స్టేషన్‌కు వెళ్లి అక్కడున్న నాలుగు టిప్పర్లలో రెండింటిని విడిపించి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న గాజులమండ్యం టీడీపీ నేత నేరుగా పోలీసు స్టేషన్ చేరుకుని పట్టుకున్న టిప్పర్లను ఎలా విడిచిపెట్టారంటూ సిబ్బందిని నిలదీశారు. దీంతో పోలీసులు హడావిడిగా ఆ టిప్పర్లను మళ్లీ స్టేషన్‌కు రప్పించారు. తాను విడిపించిన టిప్పర్లను పోలీసులు తిరిగి స్వాధీనం చేసుకున్నారని తెలుసుకున్న మండల స్థాయి నేత పోలీసులపై ఒత్తిడి తెచ్చి సాయంత్రానికల్లా మొత్తం నాలుగు టిప్పర్లనూ విడిపించేశారు. కేసు నమోదు చేయకపోగా పట్టుకున్న నాలుగు టిప్పర్లనూ విడిచిపెట్టేయడంతో గాజులమండ్యం టీడీపీ నేత, ఆయన అనుచరులు మండిపడుతున్నారు. టిప్పర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయాల్సిందేనంటూ గాజులమండ్యం పోలీసులపై భీష్మించుకున్నారు. దీంతో పోలీసులు ఇపుడు టిప్పర్లు తీసుకొచ్చి స్టేషన్ వద్ద పెట్టండంటూ మండల స్థాయి నేతను బతిమాలుకుంటున్నారు. వారం రోజులుగా పంచాయతీ జరుగుతున్నా టీడీపీలోని రెండు వర్గాల్లో ఏ వర్గమూ వెనక్కు తగ్గడం లేదు. మట్టి దందా చేపట్టిన కొట్రకోనకు చెందిన టీడీపీ నాయకుడు తనకు వ్యతిరేకంగా పోలీసులకు సమాచారమిచ్చి, కేసు నమోదుకు పట్టుబట్టిన నేతకు ఫోన్ చేసి బెదిరింపులకు దిగినట్లు సమాచారం. ఈ క్రమంలో శనివారం రాత్రి పది గంటలకు నాలుగు లారీలను పోలీస్‌స్టేషన్‌లో తీసుకొచ్చి పెట్టారు. ఈ వ్యవహారం మండల టీడీపీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోంది. కాగా ఈ వ్యవహారంపై రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావును వివరణ కోరగా తన దృష్టికి రాలేదన్నారు. విచారించి వాస్తవమని తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.

తిరుమలను నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించండి

- కేంద్రమంత్రికి టీటీడీ ఛైర్మన్ లేఖ

తిరుమల, మార్చి1(ఆంధ్రజ్యోతి): తిరుమల పుణ్యక్షేత్రంపై విమానాలు ఎగరకుండా నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు లేఖ రాశారు. ఆగమశాస్త్ర నిబంధనలు, ఆలయ పవిత్రత, భద్రత, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు ప్రకటించాలని కోరారు. తిరుమల కొండపై తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలు, హెలికాప్టర్లు, ఇతర వైమానిక కార్యకలాపాలతో శ్రీవారి ఆలయం చుట్టూ ఉన్న పవిత్రమైన వాతావరణానికి భంగం కలుగుతోందని పేర్కొన్నారు. తక్షణం ఈ విషయంపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పింఛన్ల పంపిణీలో మొదటిస్థానం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో జిల్లాకు మొదటిస్థానం దక్కింది. 2,62,461 మందికి గాను తొలిరోజైన శనివారం 2,53,656 మందికి (96.65 శాతం) పంపిణీ చేశారు. రూ.107.03 కోట్లను 5,800 మంది సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్ తిరుపతి రూరల్ మండలం వేదాంతపురంలో పాల్గొన్నారు. జిల్లాకు మొదటి స్థానం దక్కడంపై డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి, ఇతర ఉద్యోగులను ఆయన అభినందించారు.



వేదాంతపురం పంచాయతీలో పింఛను అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

గొలుసు దొంగ అరెస్ట్

- 170 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబీ

నాయుడుపేట టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళల మెడలోని బంగారు సరుడును అపహరించే యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ చెంచుబాబు మీడియాకు వివరాలను వెల్లడించారు. నాయుడుపేట పొగగొట్టం కాలనీకి చెందిన భవానీశంకర్ డిప్లమో పూర్తి చేశాడు. జులాయిగా తిరుగుతూ సులభ సంపాదనకు చోరీలను ఎంచుకున్నాడు. బైక్‌లో తిరుగుతూ ఇంటిముందు ముగ్గులు వేసే, వాకింగ్ చేసే మహిళల మెడలో బంగారు సరుడును లాక్కుని పరారయ్యేవాడు. పోలీసులు నిఘా పెట్టి, శనివారం అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.12లక్షల విలువచేసే 170 గ్రాముల బంగారు అభరణాలు రికవరీ చేసినట్లు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన అర్బన్ సీఐ బాబీ ఎస్ఐ ఆదిలక్ష్మి, సిబ్బందిని అభినందించారు.

పుత్తూరు వార్తలు

పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే

● అరాచకాలకు పాల్పడితే అణచివేస్తాం



పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మార్చి1(ఆంధ్రజ్యోతి): 1వ తేదీ వచ్చిందంటే పండుగ వాతావరణం కనబడుతోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. పింఛన్ల పంపిణీతో అవ్వ, తాత, వితంతు, వికలాంగులు ముఖాల్లో నవ్వులు పూస్తున్నాయన్నారు. శనివారం గేటు పుత్తూరులో పలువురికి ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర బడ్జెట్ లో విద్యా, వైద్యంతో పాటు సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. నగరి నియోజకవర్గంలో గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధిని గడచిన 8 నెలల్లో చేపట్టినట్లు వెల్లడించారు. అరాచకాలు, దౌర్జన్యాలు, భూ కబ్జాలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గంజాయి, గుండాయిజం, భూ కబ్జాలనను ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించారు. కాగా 5,724 మందికి రూ.2.45 కోట్ల పంపిణీ చేపట్టనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పుత్తూరు పట్టణ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణేష్, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకుడు నబీ మస్తాన్, టీడీపీ నాయకులు బాబు, హరి, బాబునాయుడు, సాయి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు

పుత్తూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు కేంద్రాల్లో శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభయ్యాయి. ప్రభుత్వ బాలుర, బాలికల కళాశాలలు, సాయి జ్యోతి, హిమజ, శ్రీవేద జూనియర్ కళాశాల్లో 1762 మంది విద్యార్థులకు గానూ 67 మంది గైర్హాజరయ్యాయి. తెలుగు, సంస్కృతం, తమిళ బాషా పరీక్షలు జరిగాయి.

కేసులను పెండింగ్‌లో ఉంచొద్దు

కేవీబీపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కేసులను పెండింగ్ ఉంచవద్దని పుత్తూరు రూరల్ డీఎస్పీ రవికుమార్ ఆదేశించారు. శనివారం ఆయన కేవీబీపురం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. అలాగే మఠం గ్రామంలో ఎస్సీ, ఎస్టీ భూ వివాద కేసుపై సమగ్ర విచారణ నిర్వహించాలని ఎస్ఐ నరేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌సీ విశ్వనాథం, పీసీలు సలాం, విజయ్, దాము తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఆర్టీసీ ఆదాయం రూ.55.45లక్షలు

శ్రీకాళహస్తి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆర్టీసీకి రూ.55.45లక్షలు ఆదాయం వచ్చిందని డిపో మేనేజరు మునిచంద్రయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి, రథోత్సవం, కల్యాణోత్సవం మూడు రోజులకు గాను 1.24లక్ష కిలోమీటర్లు నడపగా రూ.55.45లక్షలు వచ్చిందన్నారు. గత సంవత్సరం రూ.50.37లక్షలు వచ్చినట్లు తెలిపారు. డిపో సిబ్బందికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రసాయన కర్మాగారాల తనిఖీ

రేణిగుంట మార్చ్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులమడ్యం పారిశ్రామికవాడలో పలు రసాయన కర్మాగారాలను ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేశారు. ఏపీ డ్రగ్స్ రేడియంట్ ఫార్మా కెమికల్స్, క్రోమో మెడ్ కేర్ ఫార్మా, సినర్జీ రెమిడీస్, మల్లాడి డ్రగ్స్ ఫార్మాసూటికల్స్, గ్లోరీ ఫార్మా కెమికల్స్, ఇండియన్ పొటాష్, ఓఆర్ డిస్టిలరీస్‌లోని మీథేన్, మొలాసిస్ రికార్డులను పరిశీలించారు. నెలాఖరులోగా లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి, అసిస్టెంట్ సూపరింటిండెంట్ వాసుదేవ చౌదరి, ఇన్‌స్పెక్టర్ నరసానాయుడు, ఎస్ఐలు కవిశ్వర్ నాయుడు, అంజలి ప్రసన్న పాల్గొన్నారు.

రేపు హైడ్రోజన్ ప్లాంట్ ప్రారంభం

శ్రీకాళహస్తి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం పంగూరు సమీపంలోని రాక్‌మెన్ పరిశ్రమలో హైడ్రోజన్ ప్లాంట్‌ను సోమవారం ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం అందుకు సంబంధించి తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిశ్రమలో పర్యటించారు. ఏర్పాట్లపై యాజమాన్యంతో చర్చించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర తదితరులున్నారు.

మాదిగ అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళి



వరదయ్యపాళెం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధనలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు మండలంలోని చిన్నపాండూరులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రాఘవయ్య, మండల అధ్యక్షుడు నీరుపాకు దొరబాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. గౌరి భాస్కర్, బాలకుమార్, ధనశేఖర్, మౌళి, సుధాకర్, డిల్లీ, మధు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల పింఛను అందజేత

వరదయ్యపాళెం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలం చిన్నపాండూరు పంచాయతీ పాదిరికుప్పానికి చెరందిన కె.విజయ వితంతు పింఛను పొందుతోంది. ఈమె గత నెల ఆస్పత్రికి వెళ్లడంతో పింఛను తీసుకోలేక పోయింది. ఈనెల రెండు నెలల పింఛను రూ.8 వేలను అధికా రులు ఆమెను అందజేశారు. ఇందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ముస్లిం మత గురువులకు నిత్యావసరాల పంపిణీ



వరదయ్యపాళెం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ఎన్ఆర్ఐ షేక్‌బాబు నూరుద్దీన్ ఆర్థిక సాయంతో షేక్ అబ్దుల్ ఆధ్వర్యంలో వరదయ్యపాళెం, తడ మండలాల పరిధిలో మసీదుల్లోని 40మంది మత గురువులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణాన్ని తొలగించండి

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లా మాంబపురంలో ఇళ్ల మధ్యలో ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించాలని మహిళలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిబంధనల ప్రకారం గ్రామానికి 240 మీటర్ల దూరంలో మద్యం షాపు ఉండాలన్నారు. మందుబాబులు గ్రామంలో ప్రశాంతత లేకుండా చేస్తున్నారన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

వాకాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన వాకాడు మండలంలోని అధికారులు పట్టించుకోవడం లేదని టీడీపీ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి కుంచం దయాకర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ రెండు వారాలుగా వరి పంట కోతలు మొదలయ్యాయని, రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారులు ధరలు తగ్గించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు గగ్గోలు పడుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీంతో వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే బస్తాకు రూ.150 నుంచి రూ.200 తగ్గించి కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ చూపి రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలన్నారు.

కడివేడులో రీ సర్వేపై గ్రామసభ

చిల్లకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివేడు గ్రామంలో శనివారం రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీనివాసులు మాట్లాడుతూ కడివేడు గ్రామంలో సోమవారం నుంచి రీ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు తమ హక్కు పత్రాలను తీసుకువచ్చి భూములకు రీ సర్వే చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో బాలాజీ, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల పునరుద్ధరణకు చర్యలు

చిల్లకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఈవోపీఆర్డీ సిరాజ్ తెలిపారు. శనివారం మండలంలోని పంచాయతీల కార్యదర్శులు, సిబ్బందికి తడి, పొడి చెత్తను సేకరణపై అవగాహన కల్పించారు. సంపద తయారీ కేంద్రాల్లో వసతులను మెరుగుపరిచి గ్రామాల్లోని తడి, పొడి చెత్తలను సేకరించి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.





కానూరులో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనం - బంగారంపేటలో పిల్లర్ల ప్రారంభంలోనే ఆగిన పనులు

సచివాలయ భవనాలకు మోక్షమెప్పుడో?

మంజూరు చేసినవి 13, పూర్తయినవి ఐదే ● అరకొర వసతులతో సిబ్బంది అవస్థలు

పెళ్లకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన గ్రామ సచివాలయాల శాశ్వత భవన నిర్మాణాలు పెళ్లకూరు మండలంలో అసంపూర్తిగా ఉన్నాయి. మండలానికి మొత్తం 13 సచివాలయాలు మంజూరు కాగా, పెళ్లకూరు, శిరసనంబేడు, చెంబేడు, పునబాక, పాలచ్చూరు గ్రామాల్లో మాత్రమే భవనాలు పూర్తి చేశారు. తాళ్వాయిపాడు, చిల్లకూరు గ్రామ సచివాలయాల నిర్మాణాలు పూర్తి చేసినా కాంట్రాక్టర్లు అధికారులకు భవనాలు అప్పగించలేదు. మరో ఆరు భవనాలకు సక్రమంగా నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణం పూర్తికాక వివిధ దశల్లో ఆగిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం మండలంలో 13 సచివాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు రూ.5.66 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో సచివాలయానికి రూ.43.60 లక్షలతో రెండు అంతస్తుల భవనం నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. 13 భవనాలకు అప్పటి పాలకులు అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు పెళ్లకూరు, శిరసనంబేడు, చెంబేడు, పునబాక, పాలచ్చూరు గ్రామాల్లోని భవనాలను పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పజెప్పారు. ఆయా భవనాల్లో అప్పటి నుంచి సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇక కలవకూరు, పుల్లూరు గ్రామాల్లో రెండు అంతస్తుల వరకు శ్లాబువేసి వదిలేశారు. నెలబల్లి, చావాలిలో మొదటి అంతస్తు మాత్రమే నిర్మించారు. కానూరులో ఒక అంతస్తుకు శ్లాబువేసి వదిలేశారు. బంగారుపేటలో పిల్లర్లకు కమ్మీలు కట్టి బేస్‌మెంట్ కూడా నిర్మించకుండా వదిలేశారు. చిల్లకూరు, తాళ్వాయి



చిల్లకూరులో నిర్మాణం పూర్తయినా ప్రభుత్వానికి అప్పగించకుండా కాంట్రాక్టరు తాళాలు వేసిన భవనం

పాడు గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయినా బిల్లులు చెల్లించని కారణంగా కాంట్రాక్టర్లు భవనాలను ప్రభుత్వానికి అప్పగించలేదు. కొన్ని పంచాయతీల్లో ఇళ్లకు దూరంగా సచివాలయ భవన నిర్మాణాలను నిర్మించారు. వాటికి ప్రహరీ నిర్మించకపోవడంతో భద్రత కరువైంది. ఇక అసంపూర్తిగా ఉన్న భవనాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి.

సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం: పాశిం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంక్షేమాన్ని అందించడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం గూడూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రం అన్ని రంగాల్లో దివాళా తీసేలా చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేరవేరుస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. రోడ్లు అభివృద్ధి, చెరువుల మరమ్మతులు తదితర అభివృద్ధిపనులకు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం, ఆర్థిక వృద్ధే ధ్యేయంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. త్వరలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను అమలు పరిచేలా సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, వెంకటేశ్వర్లురెడ్డి, నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, పట్టాభిరామిరెడ్డి, భారతి, ప్రమీల, పెంచలయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్: విజయశ్రీ



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు సతీష్, మాధవనాయుడు, రాజసులోచనమ్మ

సూళ్లూరుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే విజయశ్రీ పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఎలిబేటి సతీష్, మాధవ నాయుడు, రాజసులోచనమ్మ, తడ మండల టీడీపీ అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్ల నిర్మాణానికి కృషి చేయండి

నాయుడుపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సాగరమాల రోడ్డుకు అనుబంధంగా సర్వీసు రోడ్ల నిర్మాణానికి కృషి చేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీకి రైతులు వినతిపత్రం అందజేశారు. శనివారం సూళ్లూరుపేటలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యేని కలిసిన రైతులు తమ సమస్యలను వివరించారు. మండలంలోని పుదూరు, విన్నమాల, పెరికిలంపాటికండ్రిగ, మర్లపల్లి, కాపులూరు, చిలమత్తూరు, అన్నమేడు తదితర గ్రామాల వద్ద సాగరమాల రోడ్డుకు ఇరువైపులా పంట పొలాలు ఉన్నాయన్నారు. సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయకుండా 200 అడుగుల వెడల్పుతో సాగరమాల రోడ్డు నిర్మిస్తుండడంతో పొలాల్లోకి వెళ్లడానికి దారి లేకుండా పోతోందన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సర్వీస్ రోడ్లు నిర్మించేలా చూడాలని విజయశ్రీకి రైతులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు జలదంకి వెంకటకృష్ణారెడ్డి, సన్నారెడ్డి హరినాథరెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, సునీల్, కిరణ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు: డీఎస్పీ



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాల యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్క రించుకుని విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, అఘాయిత్యాలకు పాల్పడినా చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు

చిల్లకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపారు. ఆలయం ఆవరణలో స్వామి, అమ్మవార్లను ఊరేగిం చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఓజిలిలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర

ఓజిలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఓజిలి సచివాలయం వద్ద శనివారం ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో నిర్వహించారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

గూడూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థినులను పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని ప్రగతి సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని చెన్నూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులకు ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో విజయ్‌కుమార్ దాతృత్వంతో విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మములాజాన్, కల్పన, రవి, నారాయణ, గిరి, నాను, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ సభ్యుడు ప్రసాద్

గూడూరు అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని లయన్స్‌క్లబ్ సభ్యుడు ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక సునీత సేవాసంస్థ కార్యాలయంలో ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు వృత్తి విద్యా కోర్సుల్లో ఉచితంగా శిక్షణ అందజేస్తూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు సేవా సంస్థ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సారంగం సులక్ష్మి, శిక్షకరాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల దీక్షకు సీఐటీయూ మద్దతు

పెళ్లకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పునబాక గ్రామంలో మూత పడిన వైష్ణవి డెయిరీ పరిశ్రమ ఎదుట కార్మికులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షకు సీఐటీయూ నాయకులు శనివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు శివకవి, ముకుంద, గురవయ్య, మణి మాట్లాడుతూ 15 ఏళ్లుగా వైష్ణవి డెయిరీలో పనిచేస్తున్న కార్మికులకు చట్టపరమైన రాయితీలు ఇవ్వకుండా గుట్టుచప్పుడు కాకుండా మూసి వేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పులి శ్రీకాంత్, పుట్టయ్య, విజయభాస్కర్, బలరాం, జగదీశ్, గంగాధర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోండి

వెంకటగిరి టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): దాతల అందజేసే సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర అన్నారు. శనివారం స్థానిక ఆర్వీఎం ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ఈ నెల 17నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, డిల్లీబాబు, రవీంద్ర, సుబ్బారావు, శ్రీహరి, సుంకర రవికుమార్, మురళి, వల్లభదాసు తదితరులు పాల్గొన్నారు.

నీటి గుంతలో స్నానానికి వెళ్లి డ్రైవర్ మృతి



మృతి చెందిన దిలీప్ కుమార్ యాదవ్

తడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్నానానికి గుంతలో దిగిన డ్రైవర్ నీట మునిగి మృతి చెందిన ఘటన మాంబట్టు సెజ్‌లో జరిగింది. జార్ఖండ్ రాష్ట్రా నికి చెందిన దిలీఫ్ కుమార్ యాదవ్(32) లారీ డ్రైవర్. నాగాలాండ్ నుంచి మాంబట్టు సెజ్‌లోని ఓ పరిశ్రమలో లోడింగ్‌కు శుక్రవారం సాయంత్రం వచ్చాడు. పరిశ్రమకు ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో లారీని ఆపి పక్కనే ఉన్న గుంతలో స్నానానికి వెళ్లాడు. ఈత రాక పోవడంతో నీటిలో మునిగిపోయి ఊపి రాడక మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు శనివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తకాలు మోసే వయసులో పుస్తెల భారం వద్దు



రాజుల కండ్రిగలో జరిగిన అవగాహన ర్యాలీ

కేవీబీపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పుస్తకాలు మోసే వయసులో పుస్తెల భారం మోపవద్దని రాజులకండ్రిగ ఉన్నత పాఠశాల విద్యార్థినులు శనివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుమతి, కల్పలత ఆధ్వర్యంలో బాల్య వివాహల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 18 సంవత్సరాలు నిండకుండా బాలికలకు వివాహం జరిపించరాదని, ఒకవేళ జరిపినా, ప్రోత్సహించినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బజావతి అన్నారు. గోవర్ధనపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ శిల్ప, ఉపాధ్యాయులు హరనాథ్, ముద్దుకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): బీఎన్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం ఆధ్వర్యం బాల్య వివాహాలు, కిషోర బాలికల బేటీ బచావో, బేటీ పఢావోలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం రమణయ్య, సూపర్‌వైజర్ యమున, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు సర్టిఫికెట్ల పరిశీలన

శ్రీకాళహస్తి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఈబీసీ, కాపు, ఆర్య వైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలో స్వయం ఉపాధి రుణాల మంజూరుకు పలువురు దరఖాస్తు చేసుకున్నట్లు కమిషనర్ గిరికుమార్ తెలిపారు. ఈనెల 3న సోమవారం ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పలు బ్యాంకు మేనేజర్లు అర్హీదారుల సర్టిఫికెట్లు పరిశీలిస్తారన్నారు. ఇందుకు దరఖాస్తుదారులు తమ వెంట ఆధార్‌కార్డు, కుల ధృవీకరణ పత్రం, రేషన్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, జనన ధృవీకరణ పత్రం, పాస్‌పోర్టు ఫొటోలు తదితర ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ అప్లికేషన్‌తో రెండు జిరాక్సు కాపీలను తీసుకుని రావాలన్నారు.

ముక్కంటి సేవలో వెండి అంబారీ దాతలు

శ్రీకాళహస్తి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం వెండి అంబారీ దాత బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుం జయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు చట్టాలపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని పెద్దపాలేడు పంచాయతీలోని మూలబొందల గిరిజన కాలనీలో సామాజిక న్యాయంపై రెవెన్యూ, మండల పరిషత్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో అవగాహన సమావేశం జరిగింది. ప్రభుత్వ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పలు సమస్యలను గిరిజనులు అధికారులు దృష్టికి తీసుకు వచ్చారు. ఎంపీడీవో త్రివిక్రమరావు, ఆర్ఐ నల్లయ్య, వీఆర్వో తిరుమలరావు, సర్పంచ్ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ

నారాయణవనం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్న ఊంజలసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివార్ల ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీధర్ భట్టాచార్య ఆధ్వర్యంలో ఊంజల సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘనస్వాగతం



సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు, కలెక్టర్

రేణిగుంట మార్చి 1:(ఆంధ్రజ్యోతి) సీఎం చంద్రబాబుకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు పర్యటంలో భాగంగా శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక విమానంలో విమానాశ్రయం చేరుకున్న సీఎంకు శ్రీకాళహస్తి, చంద్రగిరి, పూతలపట్టు, సత్యవేడు ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, నాని, మురళి మోహన్, ఆదిమూలం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్.సి. మునికృష్ణ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, జేసీ శుభం బన్సల్, ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి తదితర అధికారులు ప్రజాప్రతిని స్వాగతం పలికారు. అనంతరం సీఎం ప్రత్యేక హెలికాప్టర్లో గంగాధర నెల్లూరుకు బయలుదేరి వెళ్లారు.

ఇచ్చిన హామీ అమలు: ఎమ్మెల్యే సుధీర్



శ్రీకాళహస్తి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీతో లబ్ధిదారుల్లో ఆనందం నెలకొందని, ఇచ్చిన హామీని నెరవేర్చామని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. ఏర్పేడు మండలం అంజి మేడులో శనివారం ఆయన పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు రూ.వెయ్యి పెంచి అందిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పింఛనుదారుల కళ్లల్లో ఆనందం: ఎమ్మెల్యే ఆదిమూలం



నారాయణవనం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి 1వ తేది అనగానే పింఛనుదారుల కళ్లలో ఆనందం కనబడుతోందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. శనివారం ఆయన మండలంలోని కల్యాణపురంలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. అనంతరం తడి చెత్త, పొడి చెత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, గ్రామ సర్పంచ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తొట్టంబేడులో పింఛన్ల పంపిణీ



శ్రీకాళహస్తి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం ఇలగనూరు పంచాయతీలో టీడీపీ మండల అధ్యక్షుడు గాలి మురళీనాయుడు అర్హులైన వితంతువులు, వికలాంగులు, వృద్ధులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చెప్పిన మాట ప్రకారం పింఛన్లను పెంచి అందిస్తున్నారన్నారు. ఈఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది జలజ, రాజేంద్ర, నాయకులు కస్తూరయ్య, తిరుమల, బాబు, వెంకటాద్రి, గురమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ఆదిమూలం స్వాగతం



పిచ్చాటూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుకు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం శనివారం ఘన స్వాగతం పలికారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు పర్యటన నిమిత్తం శనివారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయానికి సీఎం చేరుకున్నారు. అప్పటికే విమానాశ్రయంలో వేచి ఉన్న ఎమ్మెల్యే ఆదిమూలం సీఎంకు ఘనస్వాగతం పలికారు.

నేడు అశ్వ, సింహ వాహన సేవలు





శ్రీకాళహస్తి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో సభాపతి కల్యాణోత్సవం తరువాత ఆదివారం నిర్వహించే కైలాసగిరి ప్రదక్షిణోత్సవం ఎంతో విశేషతను సంతరించుకుంది. సుమారు 21 కిలోమీటర్ల పొడవున ఈ విశేషోత్సవాన్ని నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి రాజగోపురం నుంచి స్వామివారు అశ్వవాహనంపై, అమ్మవారు సింహ వాహనంపై అధిరోహించి పుర విహారం చేయనున్నారు.

మార్పుతో కేసుల మాఫీ

నవోదయం 2.0 సమావేశంలో ఎక్సైజ్ అధికారులు



సమావేశంలో సమస్యలను విన్నవిస్తున్న గ్రామ పెద్దలు

నారాయణవనం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సారా తయారీకి దూరంగా ఉంటూ స్వయం ఉపాధి దిశగా మార్పు చెందితే పాత కేసులను దశల వారీగా మాఫీ చేయిస్తామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్ పేర్కొన్నారు. మండలంలోని తిరువట్యంలో శనివారం సాయంత్రం నవోదయం 2.0 సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ సహకారంతో చదువుకున్న యువతకు ఉద్యోగావకాశాలు, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, స్వయం ఉపాధికి బ్యాంకుల నుంచి రుణసాయం అందిస్తామని తెలిపారు. అయితే గ్రామ పెద్దలు సౌరకాయలు, తిరువేంగడం మాట్లాడుతూ... గతంలో అధికారులు తమ హామీలను నిలబెట్టుకోలేదన్నారు. రెవెన్యూ, ఫారెస్ట్ బఫర్ భూముల్లో వ్యవసాయానికి ఇచ్చిన భూములపై ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని వాపోయారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఉప సర్పంచ్ చీరాలయ్య, ఎస్ఐలు అంజద్‌బాషా, శివప్రసాద్, ఫారెస్ట్ రేంజర్ మాధవి, ఏఎస్ఐలు జయరాం నాయక్, గోపి, కార్యదర్శులు, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి(ఆంధ్రజ్యోతి): సారాను నిర్మూలిద్దామని తిరుపతి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి అన్నారు. శ్రీకాళహస్తి మండలం మేలచ్చూరులో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. సారా తయారు చేస్తే తీసుకునే చర్యలు, తాగితే కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లావణ్య, సచివాలయ సిబ్బంది, వీఆర్వో, పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరువాయి గ్రామంలో శనివారం నవోదయ 2.0 కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సుగుణప్రియ వెంకటేష్, ఎక్సైజ్ ఎస్ఐ బాబు, హెడ్ కానిస్టేబుళ్లు, ఫారెస్టు అధికారి శ్రీనివాసులు, మహిళా కానిస్టేబుల్ లక్ష్మి, వీఆర్వో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నయనానందకరం... నటరాజ కల్యాణం






పూజలు చేస్తున్న వేదపండితులు - మాంగళ్యాన్ని చూపుతున్న అర్చకుడు - మాంగళ్యధారణ అనంతరం అమ్మవారు - పురవీధుల్లో ఊరేగుతున్న నటరాజస్వామి, శివకామిసుందరి

శ్రీకాళహస్తి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షికోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి సభాపతి కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. దక్షయజ్ఞ సమయంలో సతీ వియోగంతో పరమేశ్వరుడు యోగధ్యానంలోకి వెళ్లడంతో సర్వలోకాలు తల్లడిల్లిపోతాయి. అదే సమయంలో తారకాసురుడు అనే రాక్షసుడు శివుడి సంతానంతో మాత్రమే మృత్యువు పొందే విధంగా వరాన్ని పొందుతాడు. శివుడికి సతీదేవి లేదని, ఆయన వివాహం జరగదని తలచిన తారకాసురుడు తన వికృతరూపం చూపుతాడు. దీంతో అదే సమయంలో స్కందుడి ధ్యానం కోసం పార్వతీదేవి హిమవంతుని కుమార్తెగా జన్మిస్తుంది. ఆ సమయంలో నటరాజస్వామికి, శివ కామ సుందరికి దేవతలు ఘనంగా వివాహం జరుపుతారు. ఈ వివాహ వేడుకల ముక్కంటి ఆలయ ప్రాంగణంలో అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శివకామసుందరి సమేత నటరాజస్వామిని పురవీధుల్లో ఊరేగించారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రుద్రాక్ష చప్పరాలపై రుద్రుడి వైభవం



శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షికోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఉదయం ఆదిదంపతులు రుద్రాక్ష చప్పరాలపై పురవిహారం చేశారు. ఆదిదంపతుల కల్యాణం ముగిసిన తరువాత ఉత్సవమూర్తులను ఆలయానికి తీసుకెళ్లారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో అలంకార మండపంలో పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ఆలయ వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను రుద్రాక్ష చప్పరాలపై అధిష్ఠింపజేసి పురవిహారానికి తీసుకువచ్చారు. జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి దంపతులను దర్శించుకోవడానికి భక్తులు బారులుతీరారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

హనుమంతుడిపై వెంకన్న విహారం



శ్రీకాహహస్తి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండమానుపురంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న అభయహస్త వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్స వాలను పురస్కరించుకుని శనివారం ఉదయం వేకువజామున స్వామిఅమ్మవార్లను అర్చకులు సుప్రభాతసేవతో మేల్కొపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్ సేవ జరిగింది. రాత్రి సర్వాలంకారభూషితులైన స్వామిఅమ్మవార్లు హనుమంత వాహనంపై విహరించారు.

నేత్రపర్వంగా సాంస్కృతిక కార్యక్రమాలు




ప్రశంసాపత్రాలతో కళాకారులు - కళాకారుల నృత్య ప్రదర్శనలు



శ్రీకాళహస్తి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ధూర్జటి కళాప్రాంగణంలో శనివారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు నయనాందకరంగా సాగాయి. ఇందులోభాగంగా పట్టణానికి చెందిన బాలసుబ్రహ్మణ్యం భక్తిరంజనితో కార్యక్రమాలు మొదలయ్యాయి. సాయంత్రం 4.30 గంటలకు తిరుపతికి చెందిన కల్యాణి నాట్య కళాక్షేత్రానికి చెందిన కీర్తి నృత్య ప్రదర్శన, 5గంటలకు చెన్నైకు చెందిన విశ్వ కామాక్షి కళాలయానికి చెందిన నీరజా విశ్వనాథన్ నృత్య ప్రదర్శన, 5.30గంటలకు నెల్లూరుకు చెందిన లక్ష్మీసాయిప్రియ వందన కూచిపూడి నృత్య ప్రదర్శన, 6గంటలకు తిరుపతికి చెరందిన అర్ధనారీశ్వర కూచిపూడి డ్యాన్స్ అకాడమీకి చెందిన ఎంపీఎస్ఎస్ దుర్గ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాత్రి 7గంటలకు హైదరాబాద్‌కు చెందిన అభిరాం భక్తిరంజని జరిగింది. 7.30గంటలకు ఇబ్రహీంపట్టణానికి చెందిన భవిరి సుభాషిణి రవి మిమిక్రీ ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. 9గంటలకు కావలికి చెందిన జాహ్నవి నృత్య ప్రదర్శన జరిగింది. చివరగా నెల్లూరుకు చెందిన గుర్రం జాషువా కవి కళానిలయానికి చెందిన లక్ష్మీప్రసాద్ ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర నాటకంతో శనివారం నాటి సాంస్కృతిక ప్రదర్శనలు ముగిశాయి.

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రంలో జిల్లా ఎస్పీ



కేఆర్పీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

రేణిగుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పరిశీలించారు. శనివారం మధ్యాహ్నం కేఎల్ హాస్పిటల్ సర్కిల్ సమీపంలోని కేఆర్పీ జూనియర్ కళాశాల సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ప్రిన్సిపాల్ లత, సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ సుధాకర్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, శ్రీనివాస, కె.ఆర్, నారాయణ జూనియర్ కళాశాల్లో పరీక్షలు జరిగాయి. 1451 మందికి గానూ 18మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

సత్యవేడు(ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తొలిరోజు తెలుగు పరీక్షకు 311 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 301 మంది హాజరయ్యారని పరీక్షల ప్రధాన అధికారి దస్తగిరి తెలిపారు. ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా డిపార్ట్‌మెంట్ అధికారిగా జాకీర్ హుస్సేన్ వ్యవహరించారు.

శ్రీకాళహస్తి(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను డీఎస్పీ నరసింహమూర్తి తనిఖీ చేశారు. సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన ఇంటర్ పబ్లిక్ పరీక్ష కేంద్రాన్ని డీఎస్పీ రవికుమార్, సీఐ రవీంద్ర, ఎస్ఐ వెంకటేష్‌తో కలసి తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ డిల్లీబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాయీ బ్రాహ్మణ పక్షపాతి చంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న కోట చంద్రశేఖర్

శ్రీకాళహస్తి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయీ బ్రాహ్మణ పక్షపాతి అని నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణులు నిర్వహించే ప్రతి క్షౌరశాలకు ఉచితంగా 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఎన్నికల హామీ సందర్భంగా ఇచ్చారన్నారు. ఆ హామీని అమలు చేయడం సంతోషరమన్నారు. కృష్ణమూర్తి, యుగంధర్, రమేష్, సుబ్బు, మహేష్, వెంటకస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ-క్రాప్ చేయించుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

రేణిగుంట మార్చి 1:(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తాను సాగు చేస్తున్న పంటను వ్యవసాయ అధికారుల సహకారంతో ఈ -క్రాప్ చేయించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శనివారం సాయంత్రం గాజుల మండ్యంలో వ్యవసాయ సహాయకులు నమోదు చేసిన పంటలను తనిఖీ చేశారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగితే పరిహారం అందించేందుకు ఈ క్రాప్ ఉపయోగపడుతుందన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా వరి పం డించిన రైతు ధనుంజయ రెడ్డి పొలాన్ని సందర్శించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావు, మండల వ్యవసాయ అధికారి సునీల్ కుమార్ రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.